

- సాగు నీటి జలాశయాలను చేపల చెరువులుగా మార్చిన వైసీపీ నాయకులు
- ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి అండతో పెట్రేగుతున్న వైనం
- లక్ష్యం తప్పిన గురురాఘవేంద్ర ప్రాజెక్టు జలాశయాలు

బాలన్నగారి చేపల చెరువు..!

మంత్రాలయం కరువు ప్రాంతం. గ్రామాల్లోని ప్రజలు సాగునీరు లేక మెట్ట వ్యవసాయం చేస్తుంటారు. వానలు కురవకపోతే పెద్ద ఎత్తున వలసపోతుంటారు. కరువు నివారణ లక్ష్యంగా గత టీడీపీ ప్రభుత్వం గురురాఘవేంద్ర ప్రాజెక్టులో భాగంగా పులికనుమ సహా నాలుగు జలాశయాలు నిర్మించింది. ఇంత మహదాశయంతో నిర్మించిన సాగునీటి జలాశయాలను కొందరు చేపల చెరువులుగా మార్చారు. ఈ అక్రమానికి పాల్పడుతున్న చేపల మాఫియాలోని వ్యక్తులు వైసీపీ నాయకుల అనుచరులు. ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి అండతో వీళ్లు పెట్రేగిపోతున్నారు. ప్రభుత్వ నిబంధనలు తుంగలో తొక్కారు. చట్ట వ్యతిరేకంగా బినామిల పేరిట చేపల వ్యాపారం చేసి రూ. కోట్లు గడిస్తున్నారు. ప్రజలకు తాగు, సాగునీరు అందకుండా చేస్తున్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా టీడీపీ నాయకులు గ్రామాలకు వెళితే.. ఈ చేపల మాఫియా నుంచి జలాశయాలను రక్షించండి.. మీకే మా ఓటు అంటున్నారంటే ఏ స్థాయిలో ఈ మాఫియా రెచ్చిపోతోందో తెలుసుకోవచ్చు.

కర్నూలు, మే 8 (ఆంధ్రజ్యోతి):

మంత్రాలయం, ఎమ్మిగనూరు, కోడుమూరు నియోజకవర్గాల్లో తుంగభద్ర దిగువ కాలువ (ఎల్లెల్సీ) చివరి ఆయకట్టుకు సాగునీరు అందించడానికి, గ్రామాల్లో ప్రజల దాహం తీర్చడానికి గత టీడీపీ ప్రభుత్వం గురురాఘవేంద్ర ప్రాజెక్టు చేపట్టింది. తుంగభద్ర నదీజలాల 3.786 టీఎంసీలు ఎత్తిపోసి 45,790 ఎకరాలకు సాగునీరు అందించాలి. 2003లో అప్పటి మంత్రి టీవీ మోహన్‌రెడ్డి నాటి సీఎం చంద్రబాబును ఒప్పించి రూ.177 కోట్లు మంజూరు చేయించారు. టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి మూగలదొడ్డి, పులచింత, చిలకలడోణ, సోగనూరు, కృష్ణదొడ్డి, రేమట, మునగాల, కంబదహాల్, చింతమానుపల్లె ఎత్తిపోతల పథకాలు, జలాశయాలు పనులు చేపట్టారు. ఆ తరువాత 2005లో ప్యాకేజీ-97 కింద రూ.62.21 కోట్లు ఖర్చు చేసి మాధవరం, బసలదొడ్డి, దుద్ది ఎత్తిపోతల పథకాలు, రిజర్వాయర్ల పనులు మొదలు పెట్టారు. వీటి కోసం రూ.242.48 కోట్లు ఖర్చు చేశారు. 1.23 టీఎంసీల సామర్థ్యంలో పులికనుమ జలాశయం నిర్మించి రూ.310 కోట్లు ఖర్చు పెట్టారు. గురురాఘవేంద్ర ప్రాజెక్టు లిఫ్టుల కోసం సుమారు రూ.552 కోట్లకు పైగా ప్రజా ధనం వెచ్చించారు. 2014లో టీడీపీ ప్రభుత్వం వచ్చాక సాగునీటిపై చంద్రబాబు ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకోవడంతో ఈ లిఫ్టులు పూర్తి చేసి సాగు జలాలు అందించారు. అయితే.. 2019లో వైసీపీ వచ్చాక గురురాఘవేంద్ర ఎత్తిపోతల పథకాలపై నిర్లక్ష్య మేఘాలు కమ్ముకున్నాయి. కనీసం నిర్వహణ నిధులు ఇవ్వకపోగా.. వైసీపీ నాయకులు ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి అండదండలతో సాగునీటి జలాశయాలను చేపల చెరువులుగా మార్చేశారు.


చిన్నతుంబళం చెరువులో అక్రమంగా చేపలు పట్టేందుకు సిద్ధం చేసిన వలలు, చేపల రవాణాకు కోసం టెంపో వాహనం

పెట్రేగుతున్న చేపల మాఫియా!

కోసిగి మండలం దుద్ది జలాశయం కింద 3 వేల ఎకరాలకు సాగునీరు అందాలి. వైసీపీ అధికారంలోకి రాగానే ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి స్వయాన బావమరిది వైసీపీ కోసిగి మండలం ఇన్‌చార్జి మురళిరెడ్డి ఈ రిజర్వాయర్‌ను చేపల చెరువుగా మార్చారు. మత్స్య శాఖ అనుమతి లేకుండా చేపలు పెంపకం చేపట్టారు. మూగలదొడ్డి జలాశయం కింద 3,793 ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉంటే ఈ రిజర్వాయర్‌లో కూడా అనధికారికంగా చేపలు పెంపకం చేపట్టారు. ఐదేళ్లుగా చేపల మాఫియా పెట్రేగిపోతూ రూ.లక్షలు విలువైన చేపలు బెంగళూరు, హైదరాబాదుకు తరలిస్తున్నారు. మంత్రాలయం మండలం సూగూరు రిజర్వాయరు నుంచి దాదాపు 3 వేల ఎకరాలకు సాగునీరు ఇవ్వాల్సి ఉంటే ఇక్కడ కూడా ఇదే పరిస్థితి.

బినామీల పేరిట మాఫియా పెత్తనం

ఎల్లెల్సీ కాలువలో నీటి సరఫరా లేనప్పుడు మంత్రాలయం, ఎమ్మిగనూరు, కోడుమూరు నియోజకవర్గాల్లో చివరి ఆయకట్టుకు సాగునీరు ఇవ్వాలని పులికనుమ జలాశయం నిర్మించారు. దీని సామర్థ్యం 1.23 టీఎంసీలు. ఈ రిజర్వాయర్‌లో ఒక్కటీ చేపల పెంపకానికి మత్స్య శాఖ అనుమతి ఉంది. అయితే.. టెండర్లలో వైసీపీ నాయకులు పెత్తనం సాగిస్తున్నారు. ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి అత్యంత సన్నిహితుడు, పెద్దకడుబూరు వైసీపీ మండల ఇన్‌చార్జి రవిచంద్రారెడ్డి బినామీ పేరుతో చేపల పెంపకం హక్కులు దక్కించుకున్నారు. ఆన్‌లైన్ టెండర్లు పేరిట ప్రత్యర్థులను రాకుండా అధికారం మాటున పెత్తనం చెలాయిస్తున్నారు. కేవలం రూ.85 వేలకు దక్కించుకొని రూ.లక్షలు విలువైన చేపలు రవాణా చేస్తున్నారు. ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి అండ ఉండడంతో అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

రాయల చెరువులో అక్రమ చేపలు

పెద్దకడుబూరు మండలం చిన్నతుంబళం రాయల చెరువును శ్రీకృష్ణదేవరాయల కాలంలో నిర్మించారు. దీనికి కింద 1,050 ఎకరాలు ఆయకట్టు ఉంది. దిగువ గ్రామాలకు తాగునీరు కూడా ఇవ్వాలి. కొన్నేళ్లుగా అదే గ్రామానికి చెందిన గంగపుత్రులు చేపలు వేటతో జీవనం సాగిస్తున్నారు. ఈ చెరువుపై కన్నేసిన పెద్దకడుబూరు వైసీపీ నాయకుడు రవిచంద్రారెడ్డి అధికారం, ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి అండతో అక్రమంగా చేపల పెంపకం చేపట్టారు. ఏడాదికి 70-100 లారీలు, టెంపోలకు పైగా చేపలు రాష్ట్ర సరిహద్దులు దాటిస్తున్నారు. అక్రమాలు బయటకు రాకుండా ఆ గ్రామానికి చెందిన గంగపుత్రులకు ఏడాదికి రూ.6 వేలు చొప్పున రెండు విడతలుగా ఇస్తూ తన పెత్తనం సాగిస్తున్నారు. చేపలు పట్టే సమయంలో చెరువు మొత్తం ఖాళీ చేస్తుండడంతో దిగువ ఆయకట్టు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

తుంగభద్ర కలుషితం

మంత్రాలయం, కోసిగి మండలాలు తుంగభద్ర నదీతీర గ్రామాలైన నారాయణపురం, తుంగభద్ర, అగసనూరు, సాతనూరు తదితర గ్రామాల్లో అనుమతుల పేరిట చేపల మాఫియా పెట్రేగిపోతుంది. వీరికి ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి అండదండలు ఉండడంతో అధికారులు సైతం కళ్లకు గంతలు కట్టుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. చేపల చెరువుల వృథా నీటిని తుంగభద్రలో వదలేయడంతో నది జలాలు కలుషితం అవుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి.



పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదల

- జిల్లాలో 87.95 శాతం ఉత్తీర్ణత
- ప్రశాంత్ కుమార్‌కు 160వ రాష్ట్ర ర్యాంకు


జి.ప్రశాంత్ కునిగిరి మనోజ్ మహ్మద్ హర్షద్

కర్నూలు(ఎడ్యుకేషన్), మే 8: పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష ఫలితాలు బుధవారం విడుదలయ్యాయి. గత నెల 27వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా పాలిటెక్నిక్ కళాశాలల ప్రవేశాల కోసం పరీక్ష జరిగింది. కర్నూలు జిల్లాలో మొత్తం 7246 మంది విద్యార్థులు నమోదు చేసుకున్నారు. ఈ పరీక్షలో 6373 మంది పాసై 87.95 శాతం ఉత్తీర్ణత సాదించారు. ఇందులో బాలురు 4355 మంది పాసై 89.68 శాతం, బాలికలు 2018 మంది పాసై 84.44 శాతం ఉత్తీర్ణత సాధించారు. కోడుమూరుకు చెందిన చేనేత కుటుంబానికి చెందిన గోపాల్ కుమారుడు జి.ప్రశాంత్ కుమార్ 115 మార్కులతో రాష్ట్ర స్థాయిలో 160వ ర్యాంకు సాధించారు. అలాగే పత్తికొండకు చెందిన కునిగిరి మనోజ్ 113 మార్కులతో 250వ ర్యాంకును, కర్నూలు నగరం రామచంద్రనగర్‌కు చెందిన పింజరి మహ్మద్ హర్షద్ 110 మార్కులతో386 వ ర్యాంకును సాదించి జిల్లాలో అగ్రస్థానంలో నిలిచారు.

పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో చేనేత కుటుంబానికి చెందిన గోపాల్ కుమారుడు ప్రశాంత్ కుమార్ రాష్ట్ర స్థాయిలో 115 మార్కులతో 160వ ర్యాంకును సాధించారు.

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జి.సృజన



కర్నూలు(కలెక్టరేట్), మే 8: జిల్లాలో మే 13న సజావుగాఎన్నికలు నిర్వహించడానికి పోలింగ్ కేంద్రాల్లో అన్ని సదుపాయాలు కల్పించామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా.జి. సృజన బుధవారం తెలిపారు. పోలింగ్ స్టేషన్‌లలో నిర్దేశిత మౌలిక వసతులు ఏర్పాటు చేయడంతో పాటు మొత్తం 2204 పోలింగ్ కేంద్రాల్లో 4408 కెమెరాలు ఏర్పాటు చేసి పోలింగ్ పర్యవేక్షణకు 318 మంది మైక్రో అబ్జర్వర్లను నియమించామని తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో నీటి సౌకర్యంతో రెండు టాయిలెట్లును ఏర్పాటు చేశామన్నారు. ర్యాంప్స్, విద్యుత్ సౌకర్యం కల్పించామని అన్నారు. పోలింగ్ రోజున తాగునీరు, టేబుల్స్ చైర్స్‌తో పాటు షెడ్లు, బ్యారికేడింగ్ ఏర్పాటు చేస్తామన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద తగిన భద్రతను ఏర్పాటు చేశామని తెలిపారు.

ఏపీఈసెట్ ప్రవేశ పరీక్షకు

97.43 శాతం హాజరు

కర్నూలు(ఎడ్యుకేషన్), మే 8: బీటెక్ సెకండ్ ఇయర్ కోర్సులో ప్రవేశాల కోసం నిర్వహించే ఏపీఈసెట్-2024 పరీక్ష బుధవారం జరిగింది. కర్నూలు జిల్లాలో పాలిటెక్నిక్ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులు 1,244 మంది నమోదు చేసుకున్నారు. ఇందులో 1,212 మంది పరీక్షకు హాజరు కాగా 32 మంది గైర్హాజరయ్యారు. ఈ పరీక్ష ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో జరిగింది. మొదటి సెషన్స్‌లో 704 మందికి గానూ 681 మంది, రెండో సెషన్స్‌లో 540 మందికి గానూ 531 మంది పరీక్షకు హాజరయ్యారు. ఫైల్‌నెం.04

నేడు నగరానికి సీఎం జగన్‌రాక

కర్నూలు(న్యూసిటీ), మే 8: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి గురువారం నగరానికి రానున్నారు. ఎస్‌బీఐ కూడలిలో వైఎస్.రాజశేఖర్‌రెడ్డి విగ్రహం వద్ద బహిరంగ సభలో పాల్గొననున్నారు. సీఎం జగన్ సభ కోసం వైసీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. ఓర్వకలు విమానాశ్రయం నుంచి హెలిప్యాడ్ ద్వారా ఎస్టీబీసీ కళా శాల మైదానానికి రానున్నారు. అక్కడి నుంచి ఎస్‌బీఐ కూడలికి 9 గంటలకు చేరుకుని బహిరంగ సభలో ప్రసంగిస్తారు.

జగన్‌ను ఇంటికి పంపిద్దాం

చంద్రబాబు ఆర్యవైశ్యులకు అండ: సోమిశెట్టి

కర్నూలు(అర్బన్), మే 8: దుర్మార్గుడైన జగన్మోహన్‌రెడ్డిని ఈనెల 13న ఓటు అనే ఆయుధంతో ఇంటికి పంపాలని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి పిలుపునిచ్చారు. బుధవారం తెలుగుదేశం పార్టీ కార్యాలంయలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐదేళ్ల పాలనలో వైశ్యులు ఆర్థికంగా ఎంతో నష్టపోయారని, ప్రస్తుత పరిస్థితుల్లో చంద్రబాబు వస్తేనే వ్యాపారాలు చేసుకునే పరిస్థితి ఉంటుందన్నారు. వైశ్యులకు మొదటి నుంచి చంద్రబాబు నాయుడు అండగా ఉంటూ పన్నుల భారం లేకుండా అన్ని విధాలుగా అండగా ఉంటు ఆదుకుంటారని భరోసా ఇచ్చారు. ఇటివల వైశ్యుల సమస్యలను రాష్ట్ర వైశ్య సంఘం నాయకులతో కలిసి వివరించానని తెలిపారు. జగన్‌రెడ్డి పాలనలో ఎంతో నష్టపోయామని తెలిపారు. అలాగే కర్నూలు జిల్లా పర్యటనకు వస్తున్న ఆయన ఉమ్మడి జిల్లాకు ఎలాంటి న్యాయం చేశావో చెప్పాలని ప్రశ్నించారు. న్యాయ రాజధాని లేదు.. నీటి ప్రాజెక్టులు లేవు., చివరకు సంక్షేమం, అభివృద్ధి ఊసే లేకుండా చేసిన నీకు ఎలా ఓట్లేయాలని ప్రజలు నీలదీస్తారని హెచ్చరించారు. చంద్రబాబు నాయకత్వంలోనే జిల్లాకు ట్రిబుల్ ఐటీ, ఉర్దూ యూనివర్సిటీ, ఓర్వకల్లు ఇండస్ట్రియల్‌హబ్‌తో పాటు ఎన్నో పరిశ్రమలు, కేంద్ర విద్యా సంస్థలు జిల్లాకు వచ్చాయని గుర్తు చేశారు. అభివృద్ధి చేసే చంద్రబాబుకు రాష్ట్ర ప్రజలు పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. జగన్ జైలుకు వెళ్లేందుకు సిద్ధంగా ఉండాలని, పోలింగ్ అయ్యాక ఆయన పెట్టె సర్దుకుని పారిపోయే పరిస్థితి ఉందన్నారు.

ప్రతిదాడులు తప్పవు.. జాగ్రత్త

- అధికారులు వైసీపీ ముసుగులు తీసేయాలి
- వైసీపీ గూండాలకు ఊడిగం చేయకండి
- అలాంటి అధికారుల జాబితా లోకేశ్ సిద్ధం చేయమన్నారు
- ప్రశాంతంగా పోలింగ్ జరపాలని ఎన్నికల కమిషన్‌ను కోరతాం
- టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న తిక్కారెడ్డి

కర్నూలు(అర్బన్), మే 8: వైసీపీ గుండాలు, రౌడీలు టీడీపీ కార్యకర్తలపై దాడులు ఆపకపోతే ప్రతి దాడులు తప్పవని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి హెచ్చరించారు. బుధవారం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ ఆలూరు, కోడుమూరుల్లో తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలపైన భౌతిక దాడులకు దిగుతున్నారని.. ఇది ప్రజాస్వామ్య పద్ధతి కాదని అన్నారు. వైసీపీ దాడులు పునరావృతం అయితే ప్రతి దాడులకు కర్రలు పట్టుకొని తమ కార్యకర్తలు ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు సిద్ధంగా ఉంటారని హెచ్చరించారు. దాడులు చేస్తే అధికారులు చిన్న కేసులతో సరిపెడుతున్నారని, దీంతో నిందితులు క్షణాల్లో బయటకు వచ్చి దాడులకు తెగబడుతున్నారని, వారికి సహకరిస్తున్న అధికారులపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశామని తెలిపారు. కర్నూలు, కోడుమూరు, ఆలూరుల్లో వైసీపీ ముసుగు వేసుకుని పని చేస్తున్న అధికారుల జాబితా సిద్ధం చేయాలని జాతీయ కార్యదర్శి లోకేష్ సూచించారని అన్నారు. వారు ఏ జిల్లాకు బదిలీపై వెళ్లినా ఎన్డీఏ ప్రభుత్వం వచ్చాక వారిని రప్పించి శిక్షిస్తామని అన్నారు. అందుకు వారు సిద్ధంగా ఉండాలని అన్నారు. అధికారులు వైసీపీ ముసుగులు తీసి పని చేయాలని అన్నారు. ఆలూరు మండలంలోని మణెకుర్తి, అంగనగళ్ల గ్రామంలో వెసీపీకి చెందిన 30 నుంచి 35 మంది దాడులు చేస్తోంటే పోలీసులు నివారించకుండా వారికి అండగా నిలిచారని ఆరోపిం చారు. ప్రజల్లో విపరీతమైన వ్యతిరేకత ఉండటంతో ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాలో వైసీపీ నాయకు లకు ఓటమి భయం పట్టుకుని దాడులకు తెగబడు తున్నారన్నారు. బనగానపల్లెలో ఎమ్మెల్యే భార్య దగ్గరుండి దాడులు చేయించడం దారుణమన్నారు. ఎంపీ సంజీవకుమార్ మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల వారిని దాడులకు ఉసిగొల్పి వారి చుట్టూ తిప్పుకుంటూ కేసులలో ఇరికించేందుకు పావులుగా వాడుకుంటున్నారని అన్నారు. దాడులకు పాల్పడిన వారు, దాడికి గురైన వారు కూడా బడుగులేనని, వైసీపీ కుట్రలు, మాయలో పడద్దని కోరారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఇప్పటికే ఓటమి భయం పట్టుకున్న జగన్ ఇలా దాడులకు ఉసిగొల్పుతున్నారని, ఇలాగే 13వ తేదీన అక్రమాలకు పాల్పడేందుకు డబ్బు, మద్యం, రౌడీలను సిద్ధం చేసుకుంటు న్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి నంద్యాల నాగేంద్ర, కేయి జగదీష్, టీ. సంజీవలక్ష్మి, పి.హనుమంతరావు చౌదరి, తదితరులు పాల్గొన్నారు.

జగన్‌కు ఓటమి తప్పదు

- ప్రాజెక్టులు నిర్మించి రైతాంగానికి సాగు నీరు అందిస్తాం
- కర్నూలు పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి బస్తిపాటి నాగరాజు


గూడూరు మండలంలోని చనుగొండ్ల, వై.ఖానాపురం గ్రామాల్లో నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో మాట్లాడుతున్న కర్నూలు టీడీపీ పార్లమెంట్ అభ్యర్థి బస్తిపాటి నాగరాజు

గూడూరు, మే 8: సార్వత్రిక ఎన్నికల్లో జగన్‌కి ఓటమి తప్పదని కర్నూలు టీడీపీ పార్లమెంట్ అభ్యర్థి బస్తిపాటి నాగరాజు అన్నారు. బుధవారం గూడూరు మండలంలోని చనుగొండ్ల, వై ఖానాపురం గ్రామాల్లో కర్నూలు జిల్లా టీడీపీ నాయకుడు విష్ణువర్ధన్ రెడ్డి సారథ్యంలో కోడుమూరు టీడీపీ అభ్యర్థి బొగ్గుల దస్తగిరితో కలిసి కర్నూలు టీడీపీ పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి బస్తిపాటి నాగరాజు ఇంటింటికి వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ, బీజేపీ, జనసేన శ్రేణులకు పూలమాలలతో జనం నీరాజనం పలికారు. ఈ సందర్భంగా కర్నూలు టీడీపీ పార్లమెంట్ అభ్యర్థి బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ వైసీపీ పాలనతో విసిగిపోయిన జనం, ఓటుతోనే వైసీపీకి బుద్ధి చెప్పేందుకు సిద్ధమయ్యారన్నారు. సొంత కుటుంబ సభ్యులే జగన్‌కు ఓటు వెయ్యొందటున్నారన్నారు. ఇక ప్రజలు జగన్‌కు ఎలా ఓట్లు వేస్తారని ప్రశ్నించారు. రాష్ట్రంలో టీడీపీ ప్రభంజనం సృష్టించబోతుందన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రం బాగుపడుతుందని ప్రజలు నమ్ముతున్నారన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి ఈ ప్రాంత రైతాంగానికి సాగునీరు అందించి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో చనుగొండ్ల, వై ఖానాపురం టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


బస్తిపాటి నాగరాజును అభినందిస్తున్న టీడీపీ శ్రేణులు

ప్రజల సమస్యలను ఇస్త్రీ చేసేస్తా



26, 27వ వార్డు ఎన్నికల ప్రచారంలో ఇస్త్రీ చేస్తూ ఓటర్లను ఆకట్టుకున్న గౌరు జనార్దన్‌రెడ్డి

కల్లూరు, మే 8: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పాణ్యం టీడీపీ కూటమి అభ్యర్థి గౌరు చరితమ్మను అత్యధిక మెజార్టీతో గెలిపిస్తే ప్రజల సమస్యలను ఇస్త్రీ చేసేస్తారని గౌరు తనయుడు గౌరు జనార్దన్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం కల్లూరు అర్బన్ 26, 27 వార్డులు ఆదిత్యనగర్, కృష్ణానగర్‌లో ఆయన ఇంటింటికి తిరిగి ఎన్నికల ప్రచారంలో పాల్గొని సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. రాష్ట్రంలో ఎన్‌డీఏలోని టీడీపీ కూటమి అధికారంలోకి వస్తేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. 13న జరగనున్న పోలింగ్ రోజు సైకిల్ గుర్తుపై రెండు ఓట్లు వేసి పాణ్యం ఎమ్మెల్యే, నంద్యాల ఎంపీ టీడీపీ కూటమి అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, కేతూరు మధు, రాంబాబు, విశ్వం, రఫీ తదితరులు పాల్గొన్నారు.

అన్న వచ్చాడంటే చెట్లు నరకాల్సిందే..!





సీఎం జగన్ మోహన్ రెడ్డి గురువారం ఎన్నికల ప్రచారంలో భాగంగా కర్నూలు నగరానికి వస్తున్నారు. ఇంకేముంది.. అధికారులు చెట్లపై పడ్డారు. సీఎం జగన్ మోహన్ రెడ్డి వస్తున్నాడని, ఆయనకు చెట్లు ఏమాత్రం అడ్డు ఉండకూడదని నీడను ఇచ్చే పచ్చని చెట్లను అధికారులు నరికేశారు. ఎస్టీబీసీ కళాశాల ఎదురుగా ఉన్న చెట్ల కొమ్మలను నరికేశారు. అసలే ఎండా కాలం... వేడిమి, ఉక్కపోతతో అల్లాడుతున్న జనాలు చెట్లను నరికవేయడాన్ని చూసి ఇదేం కర్మ అంటూ తలలు పట్టుకుంటున్నారు. సంవత్సరాలపాటు పెరిగిన చెట్లను ఉన్నపలంగా నరికివేయడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

- కర్నూలు న్యూసిటీ



పాణ్యంపై పట్టు ఎవరిదో

- నాడు... నేడు పాణ్యమే.. అయినా మారని తలరాత
- 13వ దఫాలుగా ఎన్నికలు, ఒక ఉప ఎన్నిక
- అయినా.. అభివృద్ధి శూన్యం.. ● అంతా కబ్జాలమయమే...
- అభ్యర్థుల గెలుపును శాసిస్తున్న కల్లూరు ఓటర్లదే ప్రధాన భూమిక

కర్నూలు, మే 8:

పాణ్యం నియోజకవర్గం ఏర్పడి ఇప్పటికీ.. దాదాపు 60 ఏళ్లు. 13 దఫాలుగా ఎన్నికలు, ఒక ఉప ఎన్నిక జరిగాయి. ఈ నియోజకవర్గం నుంచే గెలుపొందిన అభ్యర్థి కోట్ల విజయభాస్కర్ రెడ్డి ముఖ్యమంత్రిగా పని చేశారు. 2006 తర్వాత జరిగిన పునర్విభజనలో పాణ్యం నియోజకవర్గంలో మండలాలు మారినా.. పాణ్యం పేరు మాత్రం మారలేదు. పునర్విభజన కంటే ముందు పాణ్యం నియోజకవర్గంలో పాణ్యం, బనగానపల్లి, బేతంచెర్ల, వెల్దుర్తి మండలాలు ఉండేవి. పునర్విభజన తర్వాత ఓర్వకల్లు, గడివేముల, కల్లూరు మండలాలు చేరాయి. పాణ్యం నియోజకవర్గంలో 3,31,706 మంది ఓటర్లు ఉన్నారు. కర్నూలు జిల్లాలో పెద్ద నియోజకవర్గం పాణ్యమే.



ఆరుసార్లు కాటసాని గెలిచినా...

13 సార్లు జరిగిన ఎన్నికల్లో ఆరు సార్లు కాటసాని రాంభూపాల్ రెడ్డి విజయం సాధించారు. 1985, 1989, 1994, 2004, 2009, 2019 ఎన్నికల్లో ఆయన ఐదుసార్లు కాంగ్రెస్ తరపున, ఒకసారి వైసీపీ తరపున పోటీ చేసి గెలుపొందారు. ఒకసారి మాత్రం ఇండిపెండెంట్‌గా చేసి ఓడిపోయారు. పాణ్యం నియోజకవర్గంలో తన కంటూ ప్రత్యేక వర్గాన్ని ఏర్పాటు చేసుకున్నా అభివృద్ధిలో మాత్రం ఆశించిన స్థాయిలో కనిపించలేదు. మొదటి నుంచి నేటి దాకా ఆయన భూములపై కన్నేశారు. అప్పటి నుంచి కబ్జాల కాటసానిగానే పేరు ఉంది. ఆయన గానీ, ఆయన అనుచరవర్గం కానీ భూములపై కన్నేశారంటే అది కబ్జా కావాల్సిందే అని ప్రచారం ఉంది. ఎన్నికల్లో హామీలు గుప్పించి.. ఆ తరువాత నెరవేర్చడంలో విఫలమవుతున్నారనే విమర్శలు ఉన్నాయి. పాణ్యం మండలంలో స్టీల్ ప్లాంటు, నూలుమిల్లు ఇలా ప్రధాన పరిశ్రమలన్నీ మూతపడ్డాయి. పాణ్యం సిమెంటు ఫ్యాక్టరీ కూడా పలు దఫాలుగా మూతపడి ఇటీవలే మళ్లీ ప్రారంభమైంది. గ్రామాల్లోని రోడ్లన్నీ పూర్తిగా ఛిద్రమయ్యాయి. కమీషన్లు, సెటిల్మెంట్ల వల్లనే పాణ్యంలోనే పరిశ్రమలు మూతపడడానికి కారణమనే ప్రచారం ఉంది. ఎవరైనా ప్రధాన పారిశ్రామికవేత్త పరిశ్రమలు తెరవాలని ముందుకు వస్తే.. ఇక్కడి నాయకులు పెద్ద ఎత్తున కమీషన్లు గుంజుతారనే ఆరోపణలు ఉన్నాయి. గడివేముల మండలంలో ఎస్సార్బీసీ కాలువకు చిన్నతూము కట్టడానికి కూడా ఎమ్మెల్యే శ్రద్ధ కనబరచలేదు. ఈ కాల్వకు తూము కడితే.. సుమారు ఐదారువేల ఎకరాలకు సాగునీరు అందుతుందని స్థానికులు చెబుతున్నారు. గతంలో వెలగమాను రిజర్వాయరుకు హామీ ఇచ్చినా అది కూడా కార్యరూపం దాల్చలేదు. ఏరాసు ప్రతాప్ రెడ్డి టీడీపీ ఇన్‌చార్జిగా ఉన్న సమయంలో ఒక చెరువుకు భూమి పూజ చేశారు. ఆ చెరువు నిర్మాణం పూర్తయినా.. ఆ చెరువు నుంచి కనీసం ఒక కాలువ కూడా తవ్వించలేకపోయారు.



కీలకం

పాణ్యం నియోజకవర్గంలో గెలిచిన, ఓడిన వారి వివరాలు...

సం..	గెలిచిన అభ్యర్థి	పార్టీ	సమీప అభ్యర్థి	పార్టీ	మెజార్టీ
2019	కాటసాని రాంభూపాల్ రెడ్డి	వైసీపీ	గౌరు చరిత	టీడీపీ	43,857
2014	గౌరు చరితారెడ్డి	వైసీపీ	కాటసాని రాంభూపాల్ రెడ్డి	ఎన్‌డీఎల్‌పీ	11,647
2009	కాటసాని రాంభూపాల్ రెడ్డి	కాంగ్రెస్-ఐ	బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి	టీడీపీ	8,914
2004	కాటసాని రాంభూపాల్ రెడ్డి	కాంగ్రెస్-ఐ	బిజ్జం పార్థసారథిరెడ్డి	టీడీపీ	3,582
1999	బిజ్జం పార్థసారథిరెడ్డి	టీడీపీ	కాటసాని రాంభూపాల్ రెడ్డి	కాంగ్రెస్(ఐ)	21,246
1994	కాటసాని రాంభూపాల్ రెడ్డి	కాంగ్రెస్-ఐ	కె. చంద్రశేఖర్ రెడ్డి	టీడీపీ	37,389
1993 (ఉ.ఎ)	కోట్ల విజయభాస్కర్ రెడ్డి	కాంగ్రెస్(ఐ)	రేణుకా చౌదరి	టీడీపీ	31,611
1989	కాటసాని రాంభూపాల్ రెడ్డి	కాంగ్రెస్(ఐ)	బి. సత్యనారాయణ రెడ్డి	టీడీపీ	15,017
1985	కాటసాని రాంభూపాల్ రెడ్డి	కాంగ్రెస్(ఐ)	బి. సత్యనారాయణ రెడ్డి	టీడీపీ	4,059
1983	సి. రామకృష్ణారెడ్డి	టీడీపీ	ఎంబీ రెడ్డి	కాంగ్రెస్(ఐ)	5,705
1978	ఏరాసు అయ్యపురెడ్డి	జనతా	ఎం. బలరామిరెడ్డి	కాంగ్రెస్(ఐ)	8,749
1972	ఏరాసు అయ్యపురెడ్డి	కాంగ్రెస్	ఏకగ్రీవం	--	--
1967	వెంకటరెడ్డి	స్వతంత్ర	ఇ. అయ్యపురెడ్డి	కాంగ్రెస్	1,584

పాణ్యం నియోజకవర్గం ఓటర్ల వివరాలు

మండలం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
కల్లూరు	1,02,691	1,08,49	36	2,11,219
ఓర్వకల్లు	23,639	25,001	14	48,654
పాణ్యం	18,005	19,171	22	37,198
గడివేముల	16,976	17,657	02	34,635
మొత్తం	1,61,311	1,70,321	74	3,31,706

ఒక్కరు కూడా మంత్రి కాలేదు

పాణ్యం నియోజకవర్గం ఏర్పడి 60 ఏళ్లు కావస్తున్నా ఇప్పటి వరకు ఈ నియోజకవర్గం నుంచి ఇప్పటి వరకు ఒక్క ఎమ్మెల్యే కూడా మంత్రి కాకపోవడం విశేషం. 1993లో జరిగిన ఉప ఎన్నికల్లో కోట్ల విజయభాస్కర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండి ఇక్కడి నుంచి పోటీ చేశారు. అంతకు మినహాయిస్తే..ఈ నియోజకవర్గం నుంచి ఆరు సార్లు గెలిచిన కాటసానికి, రెండు సార్లు గెలిచిన ఏరాసు అయ్యపురెడ్డికి కూడా మంత్రి పదవి దక్కలేదు.

కల్లూరు ఓటర్లదే ప్రధాన భూమిక

పాణ్యం నియోజకవర్గంలో అభ్యర్థుల గెలుపు ఓటముల్లో ప్రధాన భూమిక కల్లూరు ఓటర్లదే. కల్లూరు మండలంతోపాటు అర్బన్‌లోని 16 వార్డులతో కలిసి 2,11,219 మంది ఓటర్లు ఉన్నారు. మిగతా మూడు మండలాల్లో కలిపినా కూడా 1,20,497 మంది ఓటర్లు ఉన్నారు. రెండింతల ఓటర్లు కల్లూరులోనే ఉన్నారు. అర్బన్‌లోని ఓటర్లు ప్రధాన భూమికను పోషిస్తున్నారు.

● పట్టుకోసం చరితమ్మ వ్యూహాలు!

పాణ్యం మండలంలో పట్టుకోసం గౌరు చరితమ్మ తనదైన శైలిలో ముందుకు సాగుతున్నారు. కాటసాని వైఫల్యాలు ఎండగడుతూ తానేమి చేయదలుచుకుంటున్నారో.. వాటిని నొక్కి చెబుతూ ప్రజలను తన వైపును మళ్లించుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇటీవలే ఓర్వకల్లు, కల్లూరు, పాణ్యం, గడివేముల మండలాల్లో కాటసాని వర్గంగా చెబుతున్న కొంత మంది టీడీపీలో చేరడం ఆమెకు మరింత బలాన్నిచ్చినట్టయింది. వీరితో పాటు మరి కొంత మంది నాయకులు, కార్యకర్తలు కూడా టీడీపీలో చేరేందుకు సిద్ధం కాగా, కాటసాని అదిరింపులు, బెదిరింపులతో కొంత మంది వెనక్కి తగ్గారనే ఆరోపణలు కూడా ఉన్నాయి.



ఓటెత్తిన ఉద్యోగులు

- పోస్టల్ ఓటింగ్ కోసం మూడు రోజులు బారులు
- టీడీటీ వైపే మొగ్గు చూపిన ఉద్యోగుల వర్గాలు
- 84.16 శాతం పోలింగ్ నమోదు
- ఇది రికార్డు అంటున్న వేతనజీవులు

కర్నూలు, మే 8 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెంట్ పోలింగ్ బుధవారం ముగిసింది. ఇన్నాళ్లు గంటల తరబడి క్యూలైన్లలో నిలబడి ఓటు వేసేందుకు పెద్దగా ఆసక్తి చూపని ఉద్యోగులు తాజా పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌కు బారులు తీరారు. మండుటెండలను సైతం లెక్క చేయకుండా గంటల తరబడి క్యూలైన్లలో నిలబడి ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. 84.16 శాతం ఉద్యోగులు ఓటు హక్కు ఉపయోగించుకున్నారు. జగన్ ప్రభుత్వం అనుసరించిన ఉద్యోగ, ఉపాధ్యాయ వ్యతిరేక విధానాలు, చలో విజయవాడకు వెళ్లినవారిని అరెస్టు చేసి అక్రమ కేసులు పెట్టడం, జేఏసీ ఆందోళన చేస్తే చర్చల పేరిట అవమానాలకు గురి చేయడం మొదలైన కారణాల వల్ల వారు ఆగ్రహంతో ఉన్నారు. వీరంతా పోస్టల్ బ్యాలెట్ పోలింగ్‌లో టీడీపీకి జై కొట్టినట్లు తెలుస్తుంది. సాంకేతిక కారణాలు వల్ల ఎన్నికల సంఘం గురువారం కూడా అవకాశం ఇచ్చింది. ఆ వివరాలు ఇలా..

జిల్లాలో ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉపాధ్యాయులు, వివిధ ప్రభుత్వ శాఖల ఉద్యోగులు 20,355 మంది పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తులు చేశారు. ఈ నెల 6,7,8 తేదీల్లో వారు ఓటు వేసేందుకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించారు. కర్నూలు నియోజకవర్గం పోస్టల్ బ్యాలెట్ ఓటర్ల కోసం కర్నూలు నగరం ఏ క్యాంపులోని ఇందిరాగాంధీ మెమోరియల్ హైస్కూల్ (కర్నూలు), పత్తికొండ నియోజవకర్గానికి ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్ ఎదురుగా ఉన్న ప్రభుత్వ హైస్కూల్ (పత్తికొండ), కోడుమూరు నియోజకవర్గానికి ప్రభుత్వ టౌన్ మోడల్ స్కూల్ (కర్నూలు), ఎమ్మిగనూరు నియోజకవర్గానికి ఎంపీడీవో ఆఫీస్ మీటింగ్ హాల్ (ఎమ్మిగనూరు), మంత్రాలయం నియోజకవర్గానికి జడ్పీ హైస్కూల్ (మంత్రాలయం), ఆదోని నియోజకవర్గానికి నెహ్రూ మెమోరియల్ హైస్కూల్ (ఆదోని), ఆలూరు నియోజకవర్గానికి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల (ఆలూరు), పాణ్యం నియోజకవర్గానికి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, బీ క్యాంపు (కర్నూలు)లో పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్లు ఏర్పాటు చేశారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఫెసిలిటేషన్ సెంటర్లలో పోస్టల్ బ్యాలెట్ ఓటు హక్కు వినియోగించుకోవడానికి అవకాశం కల్పించారు.

● పోస్టల్ బ్యాలెట్ ఓట్లు, పోలైన ఓట్లు, శాతం వివరాలు

నియోజకవర్గం	పీబీ ఓటర్లు	పోలైన ఓట్లు	శాతం
కర్నూలు	4,746	3,855	81.23
పత్తికొండ	2,195	1,986	88.20
కోడుమూరు (ఎస్సీ)	2,616	2,328	88.99
ఎమ్మిగనూరు	3,002	2,674	89.07
మంత్రాలయం	875	702	80.23
ఆదోని	2,291	1,820	79.44
ఆలూరు	1,682	1,372	81.57
పాణ్యం	5,208	4,346	83.45
మొత్తం	22,615	19,033	84.16

● 84.16 శాతం ఓటు హక్కు వినియోగం

జిల్లాలో 8 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోస్టల్ బ్యాలెట్ కోసం 22,615 మంది ఉద్యోగులు దరఖాస్తు చేసుకున్నారు. బుధవారం సాయంత్రం లోగ 19,033 మంది ఉద్యోగులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. 3,582 మంది ఓటు వేయాల్సి ఉంది. మండుటెండల్లో కూడా క్యూలైన్లలో నిలబడి ఓటు వేయడం కొసమెరుపు. ఈ స్థాయిలో ఉద్యోగులు బారులుతీరి ఓటు వేయడం ఇదే ప్రథమం అని ఓ ఉపాధ్యాయుడు పేర్కొనడం కొసమెరుపు. ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహంతో ఉద్యోగులు ఉండడం వల్లే కసితో ఓటు వేశారని అంటున్నారు. అత్యధికంగా ఎమ్మిగనూరు నియోజకవర్గంలో 3,002 మంది ఉద్యోగులు ఉంటే 2,674 మంది ఓటు వేశారు. 89.07 శాతం పోలింగ్ నమోదైంది. కోడుమూరు (ఎస్సీ)లో 88.99 శాతం, పత్తికొండలో 88.20 శాతం, పాణ్యంలో 83.45 శాతం, ఆలూరులో 81.57 శాతం, కర్నూలులో 81.23 శాతం, మంత్రాలయంలో 80.23 శాతం, ఆదోనిలో తక్కువగా 79.44 శాతం ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ సద్వినియోగం చేసుకున్నారు. ఓటు వేయని ఉద్యోగులకు, చివరిగా బుధవారం దరఖాస్తు చేసుకున్న ఉద్యోగులకు కూడా ఓటు వినియోగంచుకోవడానికి గురువారం చివరి అవకావం ఇచ్చారు. అత్యధికంగా 5,208 పోస్టల్ బ్యాలెట్లు ఉంటే.. అత్యల్పంగా 875 ఓటర్లు ఉన్నారు.

జిల్లాలో హోం బ్యాలెట్ ఓటింగ్ 96.63 శాతంగా నమోదైంది. ఇందులో దివ్యాంగులు 415 మందికి గాను 410 మంది ఓటు వేశారు. అదేవిధంగా 85 ఏళ్లకు పైబడిన వారు 582 మందికి గాను 525 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు.

హోం ఓటింగ్ 96.63 శాతం



● టీడీపీకి జై కొట్టిన వేతన జీవులు

ఆయా నియోజకవర్గాల్లో మూడు రోజులుగా పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ జరిగిన తీరు చూస్తే అత్యధిక శాతం ఉద్యోగులు టీడీపీకే జై కొట్టి ఉంటారని ఓటు హక్కు వినియోగించుకోడానికి వచ్చిన ఉద్యోగులు పేర్కొంటున్నారు. పలు నియోజకవర్గాల్లో ఫెసిలిటేషన్ సెంటర్ల వద్ద వైసీపీ నాయకులు కొందరు ప్రలోభాలకు గురి చేసినా కొందరు సున్నితంగా తిరస్కరిస్తే.. మరికొందరు ఇక్కడి నుంచి వెళ్లపోతే ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించడంతో అక్కడి నుంచి వారు పలాయనం చిత్తగించినట్లు తెలుస్తుంది. కర్నూలు నియోజకవర్గం ఫెసిలిటేషన్ సెంటర్ వద్ద మహిళా ఉద్యోగి ఒకరికి వైసీపీ నాయకుడు ఒకరు రూ.2 వేలు ఇస్తానని ఆశ చూపగా.. ఆమే రూ.16 తీసి ఆ వ్యక్తికి ఇచ్చి రూ.2,016 నీవే ఉంచుకో.. మా ఓటు ఎవరికి వేయాలో మాకు తెలుసు అంటూ తేల్చిచెప్పినట్లు తెలిసింది. మరో నియోజకవర్గం ఫెసిలిటేషన్ సెంటర్‌లో మహిళా ఉద్యోగి ఒకరు తన ఓటు వేసి బయటకి వచ్చాక.. మనం ఐదేళ్లు నరకం చూశాం.. మరికొద్ది రోజుల్లో మనకు స్వేచ్ఛ రాబోతుంది.. ఆలోచించి ఓటు వేయమని సూచనలు చేసినట్లు సమాచారం. అంటే.. ప్రభుత్వం తీరుపై ఉద్యోగుల్లో ఏ స్థాయిలో వ్యతిరేకత ఉందో ఇట్టే తెలుస్తుందని, పోస్టల్ బ్యాలెట్ తరహాలోనే 13న సార్వత్రిక పోలింగ్ కూడా ఏకపక్షంగా ఉండే అవకాశం ఉందని, ఇప్పటి వరకు జరిగిన ఎన్నికల తీరు పరిశీలిస్తే ఉద్యోగులు ఎటు వైపు మొగ్గు చూపితే ఆ ప్రభుత్వమే వచ్చిందని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. మెజార్టీ ఉద్యోగులు టీడీపీకి అనుకూలంగా ఓటు వేసినట్లు తెలుస్తుంది.



ఆదోనిలో...



ఆలూరులో ఓటు హక్కు వినియోగించేకునేందుకు వచ్చిన ఉద్యోగులు



పోస్టల్ బ్యాలెట్ ఓటు వేస్తున్న ఉద్యోగులు

నంద్యాల జిల్లాలో పోస్టల్ బ్యాలెట్

ఓటింగ్ 95.2 శాతం

నంద్యాల (కల్చరల్), మే 8: జిల్లా వ్యాప్తంగా పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ పూర్తయింది. మూడు రోజులుగా జరిగిన పోలింగ్‌లో మొత్తం 16,287 మంది ఉద్యోగులు ఓటుహక్కును వినియోగించుకోవడంతో 95.2 శాతం పోలింగ్ నమోదైంది. ఆరు నియోజకవర్గాలలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్లలో పోస్టల్‌బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో కొనసాగిందని జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ కె.శ్రీనివాసులు పేర్కొన్నారు. పోస్టల్‌బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియలో 16,287 మంది అత్యవసర సర్వీసులకు చెందిన ఉద్యోగులు, ఇతర విభాగాలకు సంబంధించిన సిబ్బంది, ఎన్నికల విధులు నిర్వహించే ఉద్యోగులు పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు కలెక్టర్ తెలిపారు. బుధవారం నాడు ఆళ్లగడ్డ నియోజకవర్గంలో 538 మంది ఓటర్లు, శ్రీశైలంలో 655, నందికొట్కూరులో 614, డోన్‌లో 511, నంద్యాలలో 824, బనగానపల్లెలో 505 మంది ఓటర్లు పోస్టల్ బ్యాలెట్ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ప్రధానమంత్రి పర్యటనలో ఉన్న పోలీస్ సిబ్బందికి గురువారం కూడా పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునే వెసులుబాటు కల్పించినట్లు కలెక్టర్ వెల్లడించారు.



ఎమ్మిగనూరులో ఓటు వేసేందుకు క్యూలో ఉన్న ఉద్యోగులు



ఎన్నికల పండుగకు రారండి...



ఎన్నికల ఆహ్వాన పత్రిక

ఆదోని, మే 8: ఈనెల 13వ తేదీన ఎన్నికల పండుగ ఉందని, అందరూ ఓటు వేద్దాం రండి... ఇదే మా ఆహ్వానం అంటూ కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సృజన ఎన్నికల పండుగ ఆహ్వాన పత్రికను ఓటర్లకు పంపారు. ఈనెల మే 13న ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ప్రజాస్వామ్య పద్ధతిలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా మీ అసెంబ్లీ, పార్ల మెంటు అభ్యర్థుల ఎన్నికల మహోత్సవానికి తప్పకుండా హాజరై.. మీకు నచ్చిన అభ్యర్థికి ఓటు వేయాల్సిందిగా కోరుతూ.. ఇదే ఆహ్వానం అంటూ పంపారు.

తొలిసారిగా జర్నలిస్టులకు పోస్టల్ బ్యాలెట్ ఓటు



కర్నూలు(కలెక్టరేట్), మే 8: సార్వత్రిక ఎన్నికలలో విధులు నిర్వహించనున్న జర్నలిస్టులకు కేంద్ర ఎన్నికల సంఘం తొలిసారిగా పోస్టల్ బ్యాలెట్ ఓటు హక్కును కల్పించింది. కర్నూలు జిల్లాలో 14 మంది పోస్టల్ బ్యాలెట్ ఓటుకు దరఖాస్తు చేసుకున్నారు. వారందరూ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ఉద్యోగులకు ఆర్టీసీ బస్సుల్లో రవాణా సదుపాయం

కర్నూలు(కలెక్టరేట్), మే 8: ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులకు మే 12వ తేదీన వారికి కేటాయించిన నియోజకవర్గాలకు ఆర్టీసీ బస్సుల ద్వారా రవాణా సదుపాయం కల్పిస్తామని జిల్లా కలెక్టర్ డా.జి.సృజన బుధవారం తెలిపారు. కర్నూలు నుంచి పత్తికొండ, ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆదోని, ఆలూరు, కోడుమూరు నియోజకవర్గాలకు వెళ్లేందుకు మే 12వ తేదీ ఉదయం 4.30, 5.30, 6.30 గంటలకు సుమారు 90 బస్సులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. పత్తికొండ, ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆదోని, ఆలూరు, కోడుమూరు నియోజక వర్గాల నుంచి కర్నూలుకు చేరుకునేందుకు ఉదయం 4.30, 5.30, 6.30 గంటలకు సుమారు 30 బస్సులు ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.



కోడుమూరు, మే 8:

కోడుమూరు నియోజకవర్గం కాంగ్రెస్‌కు కంచుకోట. 1962లో కోడుమూరు నియోజకవర్గం ఏర్పడిన నాటి నుంచి నేటి వరకు నియోజకవర్గాన్ని ఎస్సీ సామాజిక వర్గానికి రిజర్వు చేశారు. మొదటిసారిగా 1962 సంవత్సరంలో జరిగిన ఎన్నికల్లో అప్పటి రాష్ట్ర ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య పోటీ చేసి గెలిచారు. 1967లో స్వతంత్ర అభ్యర్థి పీఆర్ రావు గెలుపొందారు. 1985 సంవత్సరంలో టీడీపీ అభ్యర్థి ఎం.శిఖామణి, 1989లో పెద్దాయన కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఆశీస్సులతో ఇంటిపెండెంట్ అభ్యర్థి అయిన మదనగోపాల్ గెలిచారు. 1972, 1978, 1983, 1994, 1999, 2004, 2009 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులైన దామోదరం మునిస్వామి, ఎం.శిఖామణి, పరిగెల మురళీకృష్ణ గెలుపొందారు. రాష్ట్ర విభజన అనంతరం 2014, 2019లో జరిగిన ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థులు ఎం.మణిగాంధీ, జరదొడ్డి సుధాకర్ విజయం సాధించారు.

కోడుమూరు నియోవర్గంలో ప్రధానంగా టీడీపీ అభ్యర్థి బొగ్గుల దస్తగిరి, వైసీపీ అభ్యర్థి ఆదిమూలపు సతీష్ మధ్య బలమైన పోటీ ఉంది. టీడీపీలో బొగ్గుల దస్తగిరి గెలుపుకోసం డి.విష్ణువర్ధన్‌రెడ్డి పోరాటం చేస్తున్నారు. వైసీపీ అభ్యర్థి ఆదిమూలపు సతీష్ విజయం కోసం కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి కృషి చేస్తున్నారు. కోడుమూరు నియోజకవర్గంలో 1962 నుంచి 2019 వరకు 13 సార్లు ఎన్నికలు జరిగితే 1985లో మాత్రమే టీడీపీ గెలిచింది. చంద్రబాబునాయుడు కోడుమూరు నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి సారించారు. ఈ ఎన్నికల్లో ఎలాగైన టీడీపీ జెండాను ఎగురవేయాలని ప్రయత్నిస్తున్నారు. నియోజకవర్గంలో కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డి, డి.విష్ణువర్ధన్‌రెడ్డి బలమైన కేడర్ ఉంది. ఇద్దరి బలాలను ఉపయోగించుకొని నియోజకవర్గంలో పాగవేయాలని టీడీపీ అధిష్టానం ఆలోచిస్తోంది. 2014, 2019 ఎన్నికల్లో వరుసగా రెండు సార్లు విజయం సాధించిన వైసీపీ మూడోసారి కూడా గెలిచి హ్యాట్రిక్ సాధించాలని పావులు కదుపుతోంది. ఇందులో భాగంగా టీడీపీ, వైసీపీ నేతలు ఎత్తుకు పై ఎత్తులు వేసుకొంటూ ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్నారు.



- టీడీపీ, వైసీపీల మధ్య బలమైన పోటీ
- గుబులు పుట్టిస్తున్న కాంగ్రెస్ పార్టీ
- కాంగ్రెస్ పార్టీ వల్ల ఎవరికి లాభం.. ఎవరికి నష్టం
- ప్రస్తుతం టీడీపీ, వైసీపీల మధ్య ప్రధాన పోటీ

దస్తగిరి బలాలు..

చంద్రబాబునాయుడు విడుదల చేసిన కూటమి మేనిఫెస్టో టీడీపీ వైపు ప్రజలు ఆకర్షితులు అయ్యారు. కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డి, డి.విష్ణువర్ధన్‌రెడ్డికి ఉన్న జన బలం.

బలహీనతలు..


ప్రచారంలో వెనకపడటం. కూటమి విడుదల చేసిన మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో విఫలం. వెంటాడుతున్న కోట్ల, విష్ణుల వర్గ విభేదాలు.

సతీష్ బలాలు..

ప్రచారంలో దూసుకుపోవడం. క్యాడర్‌ను ఒకే తాటిపైన నడిపించడం. నియోజకవర్గంలో వైసీపీకి బలమైన కేడర్ ఉండటం.

బలహీనతలు..

ఆదిమూలపు సతీష్ నాన్ లోకల్ అనే ప్రచారం. 2014, 2019 ఎన్నికల్లో రెండు సార్లు వైసీపీని గెలిపించినా నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి చేయకపోవడం



గుబులు పుట్టిస్తున్న కాంగ్రెస్ :

మాజీ ఎమ్మెల్యే మురళీకృష్ణ పది సంవత్సరాల నుంచి వైసీపీలో కొనసాగారు. 2019, 2024 ఎన్నికల్లో తనకే సీటు వస్తుందని ఆశపడి చివరకు భంగపడ్డారు. వైసీపీలో టికెట్టు రాకపోవడంతో చివరి నిమిషంలో సొంత పార్టీ అయిన కాంగ్రెస్‌లో చేరారు. తన ఉనికి చాటుకోవాలని కాంగ్రెస్ అభ్యర్థిగా ఎన్నికల రంగంలోకి దిగాడు. దీంతో పరిగెల మురళీకృష్ణ పోటీ చేయడం వల్ల ఏ పార్టీకి ఎంత నష్టం వాటిల్లుతోందనని వైసీపీ, టీడీపీ నేతలు లెక్కలు వేసుకుంటున్నారు. మురళీకృష్ణ పోటీ చేయడం వల్ల ఎక్కువ శాతం వైసీపీకే నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

కోడుమూరు నియోజకవర్గం :

నియోజకవర్గంలో కోడుమూరు, గూడూరు, సి.బెళగల్, కర్నూలు మండలాలు ఉన్నాయి.

పోలింగ్ స్టేషన్లు : 275
మొత్తం ఓటర్లు : 2,41,767
పురుషులు : 58,715
మహిళలు : 44,020
థర్డ్ జెండర్స్ : 11



అభివృద్ధికే తొలి ఓటు

చాగలమర్రి, మే 8: ప్రభుత్వ నిర్మాణంలో ఓటు కీలకం.. అత్యంత శక్తివంతం. ప్రభుత్వాన్ని సమర్థవంతంగా నడిపించగల పార్టీకే తమ ఓటు అని, అభివృద్ధి చేసే వారికే తొలి ఓటు వేయనున్నట్లు కొత్తగా ఓటు హక్కు పొందిన యువతులు పేర్కొన్నారు.

నిజాయితీగా ఉంటేనే అభివృద్ధి



మనం ఎన్నుకునే నాయకులు నిజాయితీగా ఉంటేనే అభివృద్ధి జరుగుతుంది. నాకు తొలిసారిగా ఓటు హక్కు రావడం ఆనందంగా ఉంది. ప్రతి ఓటరు కూడా ఎలాంటి ప్రలోభాలకు లోను కాకుండా ఓటును సద్వినియోగం చేసుకుంటే అభివృద్ధిపై నాయకులను నిర్భయంగా ప్రశ్నించవచ్చు. ఓటు వేసే ముందు ఆలోచించి వేయాలి.

– మినాకుమారి, డిగ్రీ, చాగలమర్రి

ఉద్యోగాలు కల్పించే వారికే ఓటు



ఉద్యోగ అవకాశాలు కల్పించే వారికే నా మొదటి ఓటు వేస్తా. చదువుకున్న యువతకు కావాల్సింది ఉద్యోగమే. కావున అందుకు కృషి చేసే వారికే అవకాశం ఇవ్వాలి. మొదటిసారి ఓటు హక్కు రావడం గర్వంగా ఉంది. పోలింగ్ తేదీ ఎప్పుడు వస్తుందా అని ఎదురు చూస్తున్నా.

– దాక్షాయణి, డిగ్రీ, చాగలమర్రి

చిత్తశుద్ధిగల నేతకే నా ఓటు



నాకు కొత్తగా ఓటు వచ్చింది. నిజమైన పేదలందరికీ మేలు చేకూర్చాలన్న చిత్తశుద్ధిగల నేతకే నా ఓటు. నిరుపేదల కోసం పథకాలు ప్రవేశపెట్టే నాయకుడిని ఎన్నుకోవాలి. విద్య, వైద్యం అందరికీ అందుబాటులోకి తీసుకొని రావడంపై దృష్టి పెట్టే నేతను ఎన్నుకోవాలి. పార్టీలకతీతంగా ఆలోచించి చిత్తశుద్ధిగల నాయకుడిని అసెంబ్లీకి పంపాలి. అదే నా ఆలోచన. అలాంటి వారినే గెలిపించాలి.

– గురుస్రవంతి, డిగ్రీ, చాగలమర్రి

ఓటు వజ్రాయుధం



ప్రలోభాలు ఆశ చూపి ఓటు వేయించుకోవాలనే నాయకులను ఎట్టి పరిస్థితుల్లో నమ్మను. వారికి నా తొలి ఓటు వేయను. ఓటు వజ్రాయుధం లాంటిది. నిజాయితీగా ఓటు వేస్తే మనకు కావాల్సిన అభివృద్ధి పనుల గురించి ఎన్నికైన ఎమ్మెల్యేలను ధైర్యంగా అడిగే అవకాశం ఉంటుంది. ఓటు వేయడం కీలక పరిణామంగా భావిస్తున్నా.

– నవిన, డిగ్రీ, చాగలమర్రి

మాకే ఓటేస్తామని ఒట్టేస్తేనే డబ్బిస్తాం..!

ఆత్మకూరు, మే 8: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఆత్మకూరు ప్రాంతంలో ఓటర్లను ప్రలోభాలకు గురిచేసేందుకు అధికార వైసీపీ భారీగా ఖర్చు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగానే బుధవారం నుంచే డబ్బు పంపకాలను మొదలుపెట్టినట్లు సమాచారం. ఇప్పటికే పోస్టల్ బ్యాలెట్ ఓట్లకు రూ.2 వేలు పంపిణీ చేయగా, మిగతా ఓటర్లకు కూడా అదేవిధంగా రేట్ ఫిక్స్ చేసి డబ్బు పంపకాలను ముమ్మరంగా సాగిస్తున్నట్లు విమర్శలు ఉన్నాయి. అయితే వీరిలో పక్కా టీడీపీ అని ముద్రపడిన వారికి పూర్తిగా డబ్బులు ఇవ్వడం లేదని తెలిసింది. అదే క్రమంలో వైసీపీ సానుభూతిపరులకు, తటస్థులైన ఓటర్లకు ఓటుకు రూ.2 వేల చొప్పున డబ్బును ముట్టజెప్పినట్లు పట్టణంలో జోరుగా ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలోనే వైసీపీకి ఓటు వేస్తారా..? లేదా..? అనే డౌట్ ఉన్నవారికి మా పార్టీకి ఓటేస్తామని దేవుడి మీద లేక పిల్లల మీద ఒట్టేస్తేనే డబ్బు ఇస్తామని వైసీపీ నాయకులు షరతులు విధిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై పలువురు ఓటర్లు వైసీపీ నాయకుల తీరుపై మండిపడుతున్నట్లు తెలిసింది. మొత్తానికి ఎన్నికల వేళ ఆత్మకూరు ప్రాంతంలో వైసీపీ నాయకుల డబ్బు రాజకీయాలను ప్రజలు అసహించుకుంటున్నట్లు విమర్శలు ఉన్నాయి. వైసీపీ వాళ్లు ఎంత డబ్బు ఇచ్చిన టీడీపీ ఓటేస్తామని చాలా మంది ఓటర్లు చర్చించుకోవడం గమనార్హం. ఇదిలావుంటే వైసీపీ నాయకులు పట్టపగలే డబ్బు పంచుతున్నట్లు పోలీసులు మిన్నకుండిపోయారని విమర్శలు ఉన్నాయి.

ప్రమాణ పత్రంలో సంతకం..

- సమస్యలు మాత్రం యథాతథం



ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి సంతకం చేసిన ప్రమాణ పత్రం



ఆదోని టౌన్, మే 8: సీమ సమస్యలను పరిష్కరిస్తామని పోయినసారి పోటీ చేసిన అభ్యర్థులతో అసోసియేషన్ ఆఫ్ తుంగభద్ర ఎల్లెల్సీ ఆయకట్టుదారుల సంఘం సంతకాలను తీసుకుంది. అభ్యర్థులు సంతకాలయితే చేశారు కానీ ప్రధాన అంశాలను నేటికీ పరిష్కారానికి నోచుకోలేదు. రాయలసీమకు సంబంధించి ఎనిమిది అంశాల అమలుకు వ్యక్తిగతంగాను, పార్టీ పక్షాన కూడా పాటుపడతామని ప్రమాణ పత్రాలపై అభ్యర్థులు సంతకాలు చేశారు. అందులో ప్రస్తుత వైసీపీ ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి కూడా ఉన్నారు. సీమకు ప్రాణప్రదమైన సిద్దేశ్వరం అలుగు నిర్మాణం, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి కోసం ప్రత్యేక ఇరిగేషన్ కమిషన్ ఏర్పాటు, కడప ఉక్కు కర్మాగారం, గుంతకల్ రైల్వే జోన్, సీమలో కృష్ణా నది యాజమాన్య బోర్డు ఏర్పాటుతోపాటు, జాతీయ స్థాయి వ్యవసాయ విశ్వవిద్యాలయం, హార్టికల్చర్ కమిషనరేట్, మైనింగ్, దేవాదాయ, ఈఎన్సీ (ఇరిగేషన్) కార్యాలయాల ఏర్పాటు, ఇలా అనేక అంశాల సాధన కోసం పాటు పడతామని ప్రమాణపత్రంలో అభ్యర్థి సంతకాలు చేశారు. అందులో కేవలం ఆదోనిలో పాక్షికంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటుతోపాటు, పెద్ద హరివాణం గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణం మాత్రం జరిగింది. ప్రమాణ పత్రంలో ఉన్న ప్రధాన సమస్యలు మాత్రం యథాతథంగానే ఉండిపోయాయి.

విధుల నుంచి ఆప్కాస్ ఉద్యోగి తొలగింపు

కర్నూలు(న్యూసిటీ), మే 8: నగర పాలక సంస్థ పరిధిలోని ఇంజనీరింగ్ విభాగంలో ఆప్కాస్ ఉద్యోగిగా పని చేస్తున్న ఎం. రాజేష్‌ను విధుల నుంచి తొలగిస్తూ కమిషనర్ ఎ.భార్గవతేజ ఉత్తర్వులు జారీ చేశారు. ఈనెల ఒకటిన కోడుమూరు నియోజకవర్గంలోని 38,39,40 వార్డులలో జరిగిన వైసీపీ ప్రచారం లో పాల్గొన్నందుకు ఎన్నికల నియమావళి ప్రకారం విచారణకు ఆదేశించారు. విచారణలో వైసీపీ నాయకులతోపాటు ప్రచారంలో పాల్గొన్నట్లు కమిషనర్‌కు నివేదికలు అందజేశారు. ఎన్నికల నియమావళి నిబంధనల ప్రకారం కమిష నర్ రాజేష్‌ను ఉద్యోగం నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో పాటు రాజేష్ సీఎఫ్ఎంఎస్ ఐడీని కూడా తొలగించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

టోకన్లు పట్టెయ్... సమావేశానికి వచ్చెయ్..



ఎమ్మిగనూరు, మే 8: ఎమ్మిగనూరులో ఎన్నడూలేని విధంగా ఈ సారి జరుగుతున్న ఎన్నికల్లో టోకన్ల సంస్కృతి జోరుగా సాగుతోంది. ప్రధానంగా అధికార పార్టీ ఏదైనా ఓ సామాజికవర్గంతో ఆత్మీయ సమావేశం పెట్టిందంటే టోకన్లు పంపిణీ చేయడం పరిపాటిగా మారింది. ఒక్కో టోకన్ విలువ రూ.200 నుంచి రూ.300 వరకు ఉన్నట్లు తెలిసింది. దీంతో ఎక్కడ సమావేశం జరిగినా ఆ ప్రాంతానికి చెందిన అధికార పార్టీ నాయకులు ముందుగానే మహిళలకు టోకన్లు పంపిణీ చేయడం, వారిని సమావేశాలకు వచ్చేయండని చెప్పడం జరుగుతుంది. బుధవారం సైతం పట్టణంలోని ఆయా ప్రాంతాల్లో అధికార పార్టీ నిర్వహించిన చేనేతల ఆత్మీయ సమావేశాలకు పెద్ద ఎత్తున టోకన్లు పంపిణీ చేయడంతో మహిళలు భారీగా తరలి రావడం కనిపించింది. సమావేశం ముగియగానే ఆ టోకన్లు ఇచ్చిన వెంటనే సొమ్ము చెల్లిస్తున్నట్లు తెలిసింది.

● గ్రామస్థాయి వైసీపీ నాయకులకు పరాభవం

ఎన్నికల ప్రచారంలో భాగంగా గుడికల్లులో వైసీపీ అభ్యర్థి బుట్టా రేణుక, వైసీపీ నాయకులు వై.రుద్రగౌడు సోదరులతో కలిసి ప్రచారం నిర్వహించారు. అయితే ఈ ప్రచారంలో గ్రామస్థాయి నాయకులైన ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి వర్గీయులైన వైస్ ఎంపీపీతోపాటు మరో నాయకుడికి ప్రాధాన్యత లభించలేదు. ప్రచార రథంపై బుట్టా రేణుకతోపాటు మిగతా నాయకులకు అవకాశం లభించిందే తప్ప ఎమ్మెల్యే వర్గీయులకు ప్రచార రథం ఎక్కేందుకు అవకాశం ఇవ్వకపోవడంతో వారు తీవ్ర మనస్తాపానికి గురై నాయకులపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసి అక్కడి నుంచి వెళ్లిపోయారు. దీంతో గ్రామంలో వైసీపీ నాయకుల మధ్య విభేదాలు మరోసారి బయటపడ్డాయి.

ప్రచారంలో బంధుమిత్రులు

శిరివెళ్ల, మే 8: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా అభ్యర్థుల గెలుపు కోసం వారి కుటుంబ సభ్యులు సైతం ప్రచారాలు నిర్వహిస్తున్నారు. భర్త కోసం భార్య, భార్య కోసం భర్త ప్రచారం చేయడం సాధారణమైంది. కానీ ఈ ఎన్నికల్లో కుటుంబంలోని బంధుమిత్రులంతా కలిసి విస్తృతంగా ప్రచారాలు చేపడుతున్నారు. ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు ప్రధాన పార్టీల అభ్యర్థుల తరపున వారి భార్యలు, సోదర సోదరీమణులు, కోడళ్లు, అత్తలు, పెద్దమ్మలతోపాటు సమీప చుట్టరికం ఉన్న వాళ్లు ప్రచారాల్లో పాల్గొంటున్నారు. బంధువులంతా బృందాలుగా ఏర్పడి గ్రామాల్లోని స్థానిక నాయకులతో కలిసి ఇంటింటా ప్రచారం చేస్తున్నారు. ఐదేళ్లకు ఒకసారి వచ్చే ఎన్నికల్లో తమ వాళ్లను గెలిపించుకునేందుకు ఎక్కడెక్కడో ఉన్న బంధుమిత్రులంతా ఏకమవుతున్నారు.



మునుగుతున్నాం...కొనేద్దాం..!

- ఓటమి భయంలో అధికార పార్టీ అభ్యర్థులు
- ఊరూరా ఓట్ల కొనుగోలుకు బేరసారాలు



నందికొట్కూరు, మే 8: 2019 ఎన్నికలకు ముందు నోటికొచ్చినట్టు హామీలిచ్చారు. అమలు చేయమని అడిగితే పోలీసులను ఉసిగొల్పి అన్ని వర్గాలపై ఉక్కుపాదం మోపారు. అయిదేళ్లుగా ఎక్కడా అభివృద్ధి లేదు. మరోసారి జనం నమ్మే పరిస్థితి ఎలాగూ లేదు. మరోపక్క విద్యుత్ చార్జీలతోపాటు, అన్ని రకాల నిత్యావసర సరకుల ధరలు పెరిగాయి. తమ పాలనపై జనాగ్రహం కట్టలు తెంచుకుంటోందని ఆ పార్టీ నేతలు, అభ్యర్థులకే తెలిసొచ్చింది. దీంతో అడ్డదారులు తొక్కైనా గెలవాలనే ఉద్దేశంతో బరి తెగిస్తున్నారు. ఓటుకు నోటు చూపుతూ గంపగుత్తగా బేరానికి తెరలేపారు.

● పోస్టల్ బ్యాలెట్‌తోనే పోటు తెలిపోయింది:

నందికొట్కూరు నియోజకవర్గంలో ఇప్పటికే పలువురు ప్రజా ప్రతినిధులు, కీలక నాయకులు వైసీపీను వీడి ప్రధాన ప్రతిపక్షం టీడీపీలో చేరుతున్నారు. టీడీపీలోకి వైసీపీ వలసల పరంపర కొనసాగుతూనే ఉంది. జగన్ అయిదేళ్ల పాలనపై విమర్శలు గుప్పిస్తున్నారు. తన వికృత విధానాలతో రాష్ట్రాన్ని దివాళా అంచున నిలిపారంటూ దుమ్మెత్తి పోస్తున్నారు. ప్రస్తుతం సాగుతున్న తపాలా బ్యాలెట్ పోలింగ్‌లోనే ఉద్యోగుల వైఖరి ఆ పార్టీకి పూర్తిగా తెలిసొచ్చింది. దీంతో ఓటర్లకు గాలం వేసేందుకు ముందుగానే నగదు పంపిణీకి శ్రీకారం చుట్టింది. జనం మద్దతు లేకున్నా ధన బలంతోనైనా ఎన్నికలు ఎదుర్కొనే కుతంత్రానికి జిల్లాలో కొందరు తెర లేపారు.

ఈసీకి టీడీపీ ఫిర్యాదు



అధికారులపై అబ్జర్వర్‌కు ఫిర్యాదు చేస్తున్న తిక్కారెడ్డి

కర్నూలు(అర్బన్), మే 8: వైసీపీ ప్రభుత్వానికి మద్దతు పలుకుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్‌ను జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు తిక్కారెడ్డి కోరారు. బుధవారం కర్నూలు నగరంలోని ప్రభుత్వ అతిథి గృహంలో ఎన్నికల అబ్జర్వర్ ఉమేష్‌కుమార్‌ను ఎంపీ సంజీవకుమార్‌తో కలిసి ఫిర్యాదు చేశారు. ఆలూరు, కోడుమూరు, కర్నూలు నియోజకవర్గాల్లో కొందరు అధికారులు వైసీపీకి అనుకూలంగా పని చేస్తున్నారని వివరించారు. తమ పార్టీ నాయకులు, కార్యకర్తలపై దాడులకు తెగబడుతున్నా.. పోలీసు అధికారులు ప్రేక్షక పాత్రకు పరిమితమయ్యారని తెలిపారు. దాడులు చేసే సమయంలో కనీసం నివారించకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ఇలాంటి వారు ఎన్నికల విధుల్లో పాల్గొనకుండా చూడాలని కోరారు. జిల్లాలో ఈనెల 13న జరిగే పోలింగ్ ప్రక్రియ ప్రశాంత వాతావణంలో జరిపేందుకు సహకరించాలని కోరారు.

కర్నూలు

కర్నూలు ● కోడుమూరు ● పాణ్యం

దోపిడీ ప్రభుత్వాన్ని సాగనంపండి

● టీడీపీ మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి



చెన్నమ్మ సర్కిల్‌లో మాట్లాడుతున్న బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి

కల్లూరు, మే 8: రాష్ట్రంలో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అక్రమాలు, కక్ష పూరిత రాజకీయాలకు పాల్పడుతున్న దోపిడీ ప్రభుత్వాన్ని సాగనంపాలని టీడీపీ మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా వీకర్‌సెక్షన్ కాలనీలో ఆయన బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి మాటాడుతూ దివంగత నందమూరి తారక రామారావు తెలుగుదేశం పార్టీ స్థాపించిన తొమ్మిది నెలల్లోనే అధికారంలోకి వచ్చిందన్నారు. రాష్ట్రంలో పేద, మధ్య తరగతి ప్రజలకు కూడు, గూడు, గుడ్డ నినాదంతో సంక్షేమం అందించి, తాగు, సాగునీటి ప్రాజెక్టులను ఏర్పాటు చేసిన ఘనత ఎన్‌టీఆర్‌దే అన్నారు. ఆ తర్వాత పేదల అభివృద్ధి కోసం అహోరాత్రులు పరితపించే చంద్రబాబు సారథ్యంలో రాష్ట్రం అభివృద్ధి జరిగిందని స్పష్టం చేశారు. ఒక్క చాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన జగన్ అన్నివర్గాల ప్రజలకు తీరని మోసం చేశారని విమర్శించారు. రైతన్నలు, నిరుద్యోగులు, కార్మికులు, మహిళలు, ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయని జగన్‌రెడ్డికి ఓటుతో బుద్ధి చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ వలన మన భూములు కోల్పోవలసి వస్తుందని, రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడును గెలిపించుకుని ముఖ్యమంత్రిగా చేసుకుంటేనే రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం జరుగుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో పాణ్యం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గౌరు చరితమ్మను, నంద్యాల టీడీపీ ఎంపీ అభ్యర్థి డాక్టర్ బైరెడ్డి శబరిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నంద్యాల పార్లమెంట్ తెలుగు మహిళా అధ్యక్షురాలు కె.పార్వతమ్మ, క్రిష్ణవేణి, శివ, జనార్దన్‌ఆచారి, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

జగన్ పాలనలో యువత భవిష్యత్తు నాశనం

ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు గౌరు చరిత, బైరెడ్డి శబరి



పూడిచెర్లలో మాట్లాడుతున్న గౌరు చరిత, పాల్గొన్న బైరెడ్డి శబరి

ఓర్వకల్లు, మే 8: జగన్ పాలనలో ఉద్యోగావకాశాలు లేక యువత భవిష్యత్తు నాశనమైందని పాణ్యం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గౌరు చరిత, నంద్యాల ఎంపీ అభ్యర్థి బైరెడ్డి శబరి,నంద్యాల జిల్లా టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ ధ్వజమెత్తారు. బుధవారం మండలం లోని ఓర్వకల్లు, కన్నమడకల, పూడిచెర్ల, కేతవరం గ్రామాల్లో ఎన్నికల ప్రచారంలో భాగంగా రోడ్ షో, గ్రామ సభలు నిర్వహించారు. ఓర్వకల్లులో గౌరి చరితకు భారీ గజమాల వేసి టీడీపీ నాయకులు సన్మానించారు. పూడిచెర్లలో జరిగిన ఎన్నికల ప్రచారానికి గౌరుచరితతోపాటు బైరెడ్డి శబరి, జనసేన జిల్లా అధ్యక్షుడు చింతాసురేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ విధానాల వల్ల రాష్ట్రంలో కొత్త పరిశ్రమలు రాక, యువత ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కోల్పోయిందన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యోగులకు మెరుగైన పీఆర్సీ అమలు చేస్తామన్నారు. చంద్రబాబు హయాంలో ఓర్వకల్లును ఇండస్ట్రీయిల్ హబ్‌గా తీర్చిదిద్ది విమానాశ్రయం, ఉక్కుపరిశ్రమ, డీఆర్‌డీవో, సోలార్ పార్కుతో జలవిద్యుత్ కేంద్రాన్ని అమలు చేశారన్నారు. ప్రస్తుత వైసీపీ ప్రభుత్వం స్థానికులకు ఉద్యోగ, అవకాశాలు కల్పించకుండా స్థానికేతురులకు ఉద్యోగాలు కల్పించారన్నారు. జగన్ భూము లు కాజేసేందుకే ల్యాండ్ టైటిలింగ్ యాక్టును అమలు చేశారన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే దీనిని రద్దు చేస్తామని రైతులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి, రామ్మోహన్ రెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, సుధాకర్‌రావు, బొల్లవరం వెంకటేశ్వర్లు, పుల్లారెడ్డి, తిరుపాలు, శివుడు, ప్రకాశం, రాజన్న, నాగేశ్వరరెడ్డి, బాలచంద్రారెడ్డి, లక్ష్మణ్‌రావు, మోహ న్ రెడ్డి, చదువుల సుధాకర్ రెడ్డి, విశ్వేశ్వరరెడ్డి, శ్రీరాములు, అయ్యస్వామి, జన సేన నాయకులు శివ, రవికుమార్, సురేంద్ర పాల్గొన్నారు.



పాణ్యం నియోజకవర్గ జనసేన క్రియాశీల కార్యకర్తల సమావేశంలో మాటాడుతున్న గౌరు చరిత

టీడీపీ కూటమిదే అధికారం: గౌరు దంపతులు

కల్లూరు: సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ కూటమి అధికారం చేపట్టబో తుందని పాణ్యం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే గౌరుచరిత, నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జ్ గౌరు వెంకటరెడ్డి దీమా వ్యక్తం చేశారు. బుధవారం నగరంలోని 19వ వార్డులో జనసేన కర్నూలు ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు చింతాసురేష్ ఆధ్వర్యంలో చేపట్టిన జనసేన క్రీయాశీల కార్యకర్తల సమావేశానికి గౌరు దంపతులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈసందర్భంగా గౌరు చరిత మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసమే టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ ఏన్‌డీఏలో చేరారన్నారు. స్థానిక ఎమ్మెల్యే భూకబ్జాలకు ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పేం దుకు సిద్ధంగా ఉన్నారన్నారు. గౌరు వెంకటరెడ్డి మాట్లాడుతూ జనసైనికులకు గౌరు కుటుంబం అండగా ఉంటుందన్నారు. చింతాసురేష్ మాట్లాడుతూ జనసేన పార్టీ అవిర్భావం నుంచి జనసైనికులు కష్టపడి పనిచేశారని ఈనెల 13న జర గనున్న పోలింగ్‌లో యువ ఓటర్లు తప్పకుండా ఓటుహక్కు వినియో గించుకోవాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ కల్లూరు అర్బన్ కన్వీనర్ పెరుగు పురుషోత్తంరెడ్డి, 19వ వార్డు ఇన్‌చార్జి ప్రభాకర్‌యాదవ్, బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, జనసేన రాయలసీమ కో-ఆర్డీనేటర్ హసీనాబేగం, పీబీవీ సుబ్బయ్య, జగదీష్, బజారన్న, మంజునాథ్, సుధాకర్, షబ్బీర్ పాల్గొన్నారు.

గౌరు సమక్షంలో టీడీపీలో చేరిక

కల్లూరు అర్బన్ 28వ వార్డు పందిపాడు, లక్ష్మీపు రానికి చెందిన 70 వైసీపీకి చెందిన కుటుంబాలు నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి సమక్షంలో బుధవారం పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో పందిపాడుకు చెందిన ముజీబ్, మాబాషా, పుసులూరు రాముడు, సాయి, నాగరాజు లక్ష్మీపురం ఎస్సీ కాలనీకి చెందిన శేషన్న, రాజశేఖర్, రాజు, సురేంద్ర, రాజేష్, రమేష్, శేఖర్, వినోద్, అయ్యన్న, సుధీర్ ఉన్నారు. కార్యక్రమంలో పందిపాడు టీడీపీ సీనియర్ నాయ కుడు శేఖర్‌చౌదరి, అయ్యపురెడ్డి, లక్ష్మీపురం నాయకులు చిన్నమారెన్న, పుల్లారెడ్డి, జడ్పీ మాజీ చైర్మన్ ఎ.వెంకట స్వామి పాల్గొన్నారు.

● పాణ్యం మండలం మద్దూరు గ్రామానికి చెందిన మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రతాప్ పాణ్యం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గౌరు చరిత సమక్షంలో టీడీపీలో చేరారు. పాణ్యం టీడీపీ మం డల అధ్యక్షుడు జయరామిరెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు దానం పాల్గొన్నారు.



ఓర్వకల్లులో గౌరు చరితను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

రాబోయేది టీడీపీ ప్రభుత్వమే

చంద్రబాబును కలిసిన టీఎన్‌ఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు

కర్నూలు(అర్బన్), మే 8: రాష్ట్రంలో రాబోయేదీ టీడీపీ ప్రభుత్వమేనని పార్టీ అనుబంధ విద్యార్థి విభాగం టీఎన్‌ఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామాం జనేయులు అన్నారు. బుధవారం టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబును కలిసి పలు కీలక అంశాలపై చర్చించారు. తెలుగుదేశం పార్టీ కష్టకాలంలో పని చేసిన వారందరిని గుర్తించేలా ప్రణాళిక ఏర్పాటు చేశారన్నారు.



చంద్రబాబును కలిసిన రామాంజనేయులు

టీడీపీని గెలిపించండి

కర్నూలు(రూరల్), మే8: టీడీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించాలని పార్టీ బీసీ సెల్ అధ్యక్షుడు సత్రం రామకృష్ణుడు ప్రజలను కోరారు. కర్నూలు రూరల్ మండలం గొందిపర్ల, వసం తనగర్, ఇందిరమ్మకాలనీ, పూలతోట గ్రామాల్లో బుధవారం సత్రం రామకృష్ణుడు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీని గెలిపిస్తే అన్ని వర్గాల వారికి న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జిలు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సి.బెళగల్, మే 8: సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని పార్టీ నాయకుడు రేపల్లె పౌలు ప్రజలకు పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని ముడుమాల గ్రామంలో ఆయన టీడీపీ శ్రేణులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అనంతరం చంద్రబాబు నాయుడు ప్రవేశ పెట్టిన సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా రేపల్లె పౌలు మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ప్రజలు తగిన బుద్ధి చెబుతారని అన్నారు. కార్యక్రమంలో నాయకులు ఈర్లదిన్నె శేషన్న, రాజు, రాముడు, హనుమంతు పాల్గొన్నారు.

వీరశైవులకు అండగా టీడీపీ



వీరశైవుల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న టీజీ భరత్

ఆత్మీయ సమ్మేళనంలో ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థి



టీడీపీలో చేరిన వైసీపీ బీసీ సెల్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్

కర్నూలు(అర్బన్), మే 8: వీరశైవులకు తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని కర్నూలు నియోజకవర్గం టీడీపీ అభ్యర్థి టీజీ భరత్ అన్నారు. బుధవారం మౌర్యఇన్ పరిణయ హాలులో వీరశైవుల ఆత్మీయ సమ్మేళనంలో ఎంపీ అభ్యర్థి బస్తిపాటి నాగరాజుతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీజీ భరత్ మాట్లాడుతూ వీరశైవులను ఓబీసీల్లో చేర్చేందుకు తమ ప్రభుత్వం వచ్చాక చొరవ తీసుకుంటామన్నారు. జూన్ 4వ తేదీ తర్వాత వైసీపీ పనైపోతుందన్నారు. కార్యక్రమంలో వీరశైవ లింగాయత్ రాష్ట్ర కన్వీనరు శివరాజు, వీరశైవ ఐక్యవేదిక అధ్యక్షుడు మల్లికార్జునప్ప, ఐక్యవేదిక ప్రధాన కార్యదర్శి చంద్రశేఖరప్ప, ఉపాధ్యక్షుడు వీరశేఖరప్ప, మహేష్, చంద్రశేఖరప్ప, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఒక్క అవకాశం ఇవ్వండి: టీజీ భరత్

ఎమ్మెల్యేగా ఒక్క అవకాశం ఇవ్వాలని కర్నూలు టీడీపీ అభ్యర్థి టీజీ భరత్ కోరారు. బుధవారం నగరంలోని 49, 50, 51, 52 వార్డుల్లో ప్రజల ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్సీ బీటీ నాయుడుతో కలిసి ఓటర్లకు సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఈ సందర్భంగా బీటీ నాయుడు మాట్లాడుతూ ప్రజలకు నిస్వార్థంగా సేవ చేసే టీజీ కుటుంబాన్ని ఆదరించాలన్నారు. కార్యక్రమంలో దళిత జేఏసీ చైర్మన్ బోల్లెద్దుల రామక్రిష్ణ, వార్డు ఇన్‌చార్జిలు విక్రమ్ సింగ్, మణిశంకర్ నాయుడు, గణేష్, శ్రీనివాసులు, ప్రసాదరావు పాల్గొన్నారు,

పూలబజారులో టీజీ భరత్ భరోసా యాత్ర

కర్నూలు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ అభ్యర్థి టీజీ భరత్ బుధవారం నగరంలోని వన్‌టౌన్, పెద్ద అమ్మవారి శాల, పూలబజార్, మించిన బజారులలో భరోసా యాత్ర చేపట్టారు. తెలుగుదేశం పార్టీని గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. పరిశ్రమలు తీసుకొచ్చి ప్రజలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు.

టీడీపీలోకి వైసీపీ ఉమ్మడి జిల్లా చైర్మన్

ఐదేళ్ల వైసీపీ పాలనలో అన్నీ అవమానాలేనని, వాటిని భరించలేకే తెలుగుదేశం పార్టీలో చేరుతున్నానని ఉమ్మడి జిల్లా వైసీపీ కో ఆర్డినేటర్ జి. నాగరాజు యాదవ్ అన్నారు. బుధవారం కర్నూలు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ అభ్యర్థి టీజీ భరత్ సమక్షంలో ఆయన టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా నాగరాజు యాదవ్ మాట్లాడుతూ వైసీపీ ఆవిర్భావం నుంచి తాను పార్టీలో ఉన్నప్పటికి అవమానాలే పడ్డానన్నారు. వైసీపీలో బీసీలకు ప్రాధాన్యత లేదన్నారు. పార్టీలో చేరిన వారిలో సిటీ సేవాదళ్ ప్రెసిడెంట్ మహమ్మద్ ఆలీ, ప్రవీణ్, శేఖర్, సురేష్, ఇక్బాల్, వేణు, నాసిర్, మౌలాలి, ఖాదర్, ఇంతియాజ్ తదితరులు ఉన్నారు.

ఘనంగా రెడ్‌క్రాస్ దినోత్సవం

కర్నూలు(హాస్పిటల్), మే 8: వరల్డ్ రెడ్ క్రాస్ దినోత్సవాన్ని కర్నూలు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మంగళవారం ఘనంగా నిర్వహించారు. నగరంలోని రెడ్ క్రాస్ సొసైటీ బ్లడ్ బ్యాంకులో జిల్లా బ్రాంచ్ చైర్మన్ కేజీ గోవిందరెడ్డి అధ్యక్షతన హెన్రీడూనాంట్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రక్తదాన శిబిరం ఏర్పాటు చేసి క్యాన్సర్ వార్డు, రైల్వేస్టేషన్ రోడ్డులో ఉన్న వంద మంది యాచకులకు బ్రెడ్లు అందించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ వైస్ ప్రెసిడెంట్ మహేంద్ర కుమార్, మాజీ చైర్మన్ గార్గేయపురం శ్రీనివాసులు పాల్గొన్నారు.

టీజీ భరత్ గెలుపునకు ఇంటింటి ప్రచారం

కర్నూలు(కల్చరల్), మే 8: నగరంలో టీజీ భరత్ గెలిపించాలని కోరుతూ బ్రాహ్మణ సంఘం నాయకులు బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మద్వ వీధి, బీ.క్యాంపు, సి.క్యాంపు తదితర ప్రాంతాల్లో ఈ ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో జిల్లా బ్రాహ్మణ సేవా సంక్షేమ మిత్రమండలి అధ్యక్షుడు సండేల్ చంద్రశేఖర్, కార్యదర్శి కంచుగంటల శ్యామసుందర్ రావు, చల్లా నాగరాజ శర్మ, చెరువు దుర్గాప్రసాద్, అర్చక పురోహిత సంఘం అధ్యక్షుడు టీవీ రవిచంద్రశర్మ, డి. ఆనందరావు, సముద్రాల శ్రీధర్‌బాబు పాల్గొన్నారు.

వేసవి క్రీడా శిక్షణా శిబిరం ప్రారంభం



క్రీడా శిక్షణా శిబిరాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ శంకర్‌శర్మ

కర్నూలు(స్పోర్ట్స్), మే 8: స్థానిక కేంద్రీయ విద్యాలయంలో ప్రిన్సిపాల్ ప్రియదర్శిని ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన వేసవి క్రీడా శిక్షణా శిబిరా న్ని సీనియర్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డా.బి.శంకర్‌శర్మ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులను దేశ భవిష్యత్తును ఉపయోగపడే విధంగా తీర్చిదిద్దేది తరగతి గదులేనని, అలాంటి సమర్థమైన వ్యవస్థ కేంద్రీయ విద్యాలయంలోనే ఉందన్నారు. విద్యార్థులను 6 నుంచి 8 గంటల్లోగా క్రీడల్లో సాధన చేసే విధంగా చూడాలని, ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకు వేసవి ఎండల నేపథ్యంలో బయటకు రాకుండా ఉండటం మంచిదని ఆయన సూచించారు.

సూపర్ సిక్స్ పథకాలు పేదలకు వరం: సర్పంచ్



ప్రచారం నిర్వహిస్తున్న సర్పంచ్, నాయకులు

కోడుమూరు(రూరల్), మే 8: టీడీపీ సూపర్ సిక్స్ పథకాలు పేదలకు వరమని అమడగుంట్ల సర్పంచ్ వరలక్ష్మీ అన్నారు. బుధవారం సాయంత్రం స్థానిక ఎస్సీ, బీసీ కాలనీల్లో ఇంటింటి ప్రచా రంలో సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ టీడీపీ కూటమి ప్రభుత్వం గెలిపించుకుంటే మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, ఏడాదికి ఉచితంగా 3 గ్యాస్ సిలిండర్లు, అమ్మకు వందనం, రైతులకు పెట్టు బడి సాయం, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వంటి ఎన్నో సంక్షేమ పథకాలు అందుతాయని తెలిపారు. కార్యక్రమంలో శంక రరెడ్డి, తులసీరెడ్డి, గోపాల్‌రెడ్డి, రమేష్, సురేష్, రవికిషోర్, అమీన్, శేషన్న, క్రిష్ణమూర్తి, శ్రీనివాసులు, వెంకటేష్ పాల్గొన్నారు.

● ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు బస్తిపాటి నాగరాజు, బొగ్గుల దస్తగిరిలను గెలిపించాలని అమడగుంట్లలో టీడీపీ నాయకులు ప్రచారం చేశారు. కార్యక్రమంలో గిరిధర్‌రెడ్డి, చెన్నారెడ్డి, వెంకటేశ్వర్లు, రాజు, సుంకన్న, సుధాకర్‌రెడ్డి, క్రిష్ణ, దాసు, అనంతులు, ఏసు, వీరన్న పాల్గొన్నారు.

టీడీపీ ముమ్మర ప్రచారం

కోడుమూరు, మే 8: టీడీపీ అభ్యర్థి బొగ్గుల దస్తగిరి గెలిపించాలని టీడీపీ నాయకులు ముమ్మర ప్రచారం చేపట్టారు. పట్టణంలోని 20 వార్డుల్లో బుధవారం మాజీ సర్పంచు కేఈ రాంబాబు, టీఎన్‌టీయూసీ తాలుకా అధ్యక్షుడు గోపాల్‌నాయుడు, పట్టణ అధ్యక్షుడు ఎల్లప్ప నాయుడు, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు హేమాద్రిరెడ్డి, మధుసూదన్‌రెడ్డిల ఆధ్వర్యంలో టీడీపీ కార్యకర్తలు ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచు కేఈ రాంబాబు మాట్లా డుతూ టీడీపీ గెలిస్తే పట్టణంలోని సమస్యలు పరిష్కారం అవుతాయని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు కేఈ గిడ్డయ్యగౌడ్, వీరేష్, సోమేష్, గంగాధర్, భాస్కర్, కుమార్ పాల్గొన్నారు.

టీడీపీ సునామీలో వైసీపీ కొట్టుకపోవడం ఖాయం

గూడూరు, మే 6: రాష్ట్రంలో టీడీపీ సునామీలో వైసీపీ కొట్టుకపోవడం ఖాయమని మండల తెలుగు యువత అధ్యక్షుడు సుమన్‌బాబు అన్నారు. బుధవారం గూడూరు మండలంలోని ఆర్ ఖానాపురం గ్రామంలో మండల తెలుగు యువత అధ్యక్షుడు సుమన్ బాబు ఆధ్వర్యంలో టీడీపీ శ్రేణులు పెద్ద ఎత్తున ఇంటింటికి వెళ్లి బాబు షూరిటీ - భవిష్యత్ గ్యారెంటీ కింద సూపర్ సిక్స్ పథకాలను వివరించి కోడుమూరు నియోజక వర్గ టీడీపీ అభ్యర్థి బొగ్గుల దస్తగిరిని, కర్నూలు పార్లమెంట్ టీడీపీ ఎంపీ అభ్యర్థి బస్తిపాటి నాగరాజును గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మునిస్వామి, పెద్ద నరసింహులు, చిన్న నరసింహులు, మన్యంకొండ, ఎల్లప్ప, కృష్ణ, సుంకన్న, శ్రీనివాస రెడ్డి, దామోదర్ రెడ్డి పాల్గొన్నారు.

వైసీపీని ఇంటికి పంపేందుకు ప్రజలు సిద్ధం: దస్తగిరి



మాట్లాడుతున్న బొగ్గుల దస్తగిరి

గూడూరు, మే 8: వైసీపీని ఇంటికి పంపేందుకు ప్రజలు సిద్ధమయ్యారని కోడుమూరు టీడీపీ అభ్యర్థి బొగ్గుల దస్తగిరి అన్నారు. బుధవారం గూడూరు మండలంలోని చనుగొండ్ల, వై ఖానాపురం గ్రామాల్లో కర్నూలు టీడీపీ పార్ల మెంట్ అభ్యర్థి బస్తిపాటి నాగరాజు, జిల్లా టీడీపీ నాయకుడు విష్ణువర్ధన్ రెడ్డి తో కలిసి బొగ్గుల దస్తగిరి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బొగ్గుల దస్తగిరి మాట్లాడుతూ వైసీపీ పాలనలో కోడుమూరు నియోజ కవర్గంలో ఎక్కడ చూసిన ప్రజలు తాగునీరు, రైతులు సాగు నీటి కోసం అల్లా డుతున్నారన్నారు. జిల్లా టీడీపీ నాయకుడు విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ ఒక్క అవకాశం ఇవ్వండి.. కోడుమూరు నియోజక వర్గాన్ని అభివృద్ధి చేసి చూపిస్తామని అన్నారు. కోడుమూరు టీడీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

అభివృద్ధి, సంక్షేమం కోసం కృషి చేస్తాం

సి.బెళగల్: అభివృద్ధి, రైతు సంక్షేమం కోసం కృషి చేస్తానని కోడుమూరు ఎమ్మెల్యే అభ్యర్థి బొగ్గుల దస్తగిరి అన్నారు. బుధవారం సి. బెళగల్ మండల కేంద్రం, కంబదహాల్, క్రిష్ణదొడ్డి గ్రామాల్లో టీడీపీ ప్రచారం మండల కన్వీనర్ గోవిందుగౌడు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కోడుమూరు ఎమ్మెల్యే టీడీపీ అభ్యర్థి బొగ్గుల దస్తగిరి మాట్లాడుతూ రాష్ట్రంలోనే వెనుకబడిన కోడుమూరు నియోజకవర్గం సంక్షేమం కోసం ఎల్లవేళలా కృషి చేస్తానని అన్నారు. అనంతరం కర్నూలు పార్లమెంటు అభ్యర్థి నాగరాజు మాట్లాడుతూ పార్లమెంటులో కోడుమూరు, కర్నూలు అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎదురూరు విష్ణువర్ధన్ రెడ్డి, డా. అరుణకుమారి, మాజీ మండల కన్వీనర్ పాండురంగన్నగౌడు, తిమ్మప్ప, జడ్పీటీసీ గిరిజోను, మాజీ జడ్పీటీసీ చంద్రశేఖర్, స్థానిక టీడీపీ నాయకులు ఉన్నారు.

ప్రజల భూములను దోచుకునేందుకు జగన్ సిద్ధం



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న బొగ్గుల దస్తగిరి

కర్నూలు(రూరల్): ఏపీలో ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ముసుగులో ప్రజల భూములను దోచుకునేందుకు జగన్‌రెడ్డి సిద్ధమయ్యారని కోడుమూరు టీడీపీ అసెంబ్లీ అభ్యర్థి బొగ్గుల దస్తగిరి ఆరోపించారు. జగన్‌రెడ్డి ఇచ్చిన ఆ చీకటి జీవోను రద్దు చేయాలని కోరుతూ సి.బెళగల్ మండల జడ్పీటీసీ గిరిజో న్‌తో కలిసి బొగ్గుల దస్తగిరి బుధవారం కర్నూలు రూరల్ తహసీల్దార్ రామాంజులునాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా దస్తగిరి మాట్లాడుతూ దేశంలో ఇలాంటి ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను ఏ ముఖ్యమంత్రి అమలు చేయలేదన్నారు. తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేసిన వారిలో బొగ్గుల భాస్కర్ తదితరులు ఉన్నారు.

చిన్నారుల ఉక్కిరిబిక్కిరి

● ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు విద్యుత్ అంతరాయం



కరెంటు పోవడంతో సెల్‌ఫోన్ వెలుగులో చికిత్స అందిస్తున్న వైద్యులు

కర్నూలు(హాస్పిటల్), మే 8: కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో విద్యుత్ అంతరాయం రోగులకు, చిన్నారులకు నరకం చూపుతోంది. మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి ఆసుపత్రిలో కరెంటు మెయిన్ సప్లయ్ వైర్లు తెగిపోవడం, కొన్ని చోట్ల చెట్లు విరిగి పడటం వల్ల చిన్నపిల్లలు, గైనిక్ విభాగంలో దారుణమైన పరిస్థితి నెలకొంది. ఉదయం నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఆసుపత్రిలోని కొన్ని వార్డులతోపాటు గైనిక్, చిన్న పిల్లల విభాగంలో విద్యుత్ అంతరాయం వల్ల రోగులు, చంటి బిడ్డలు, బాలింతలు, గర్భిణులు విలవిల్లాడారు. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో చిన్న పిల్లలు, గైనిక్ విభాగంలో కరెంటు తీసేయడంతో సెల్‌ఫోన్ వెలుగుల్లో చిన్నారులకు చికిత్స అందించారు. ఇక గైనిక్ వార్డులో గర్భిణులు, బాలింతలు ఉక్కపోతతో అల్లాడిపోయారు. ముఖ్యంగా కరెంటు లేదంటూ లోవోల్టేజీ వల్ల తాము ఉక్కపోతతో ఉండలేకపోతున్నామని నర్సులు, వైద్యులకు, బంధువులు మొరపెట్టుకున్నారు. ముఖ్యంగా గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న పీఐసీయూలో కరెంటు పోవడంతో అత్యవసర చికిత్స పొందుతున్న చిన్నారులకు వైద్యం అందించేందుకు వైద్యులు అవస్థలు పడ్డారు. విద్యుత్ అంతరాయంలో ఓల్టేజ్ వల్ల ఓపీ సేవలకు, కంప్యూటర్ సేవలకు అంతరాయం కలిగింది. అత్యవసర విభాగాల్లో ఏసీలు, పని చేయకపోవడంతో చిన్నారులు ఉక్కపోతతో ఇబ్బంది పడ్డారు.



చిన్నారికి అట్టముక్కతో విసురుతున్న బంధువు

ఆదోని ● పత్తికొండ ● ఆలూరు ● ఎమ్మిగనూరు ● మంత్రాలయం

అంగస్కల్లో కొనసాగుతున్న పోలీస్ పికెట్

ఆలూరు, మే 8: ఈ నెల 13న జరగనున్న ఎన్నికల సందర్భంగా గ్రామాల్లో ఘర్షణలకు, అల్లర్లకు పాల్పడినా, ప్రోత్సహించినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆలూరు సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆలూరు నియోజకవర్గంలో సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ముఖ్యంగా రాజకీయ పార్టీలు ప్రశాంతంగా తమ ప్రచారాలు నిర్వహించుకోవాలని, రెచ్చగొట్టే విధంగా ప్రసంగాలు చేయకూడదని పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున నిబంధనల మేరకు నడుచుకోవాలన్నారు. ఆలూరు మండలం అంగస్కల్లో రెండు వర్గాల మధ్య జరిగిన ఘర్షణలో ఇరువురిపై కేసులు నమోదు చేశామన్నారు. గ్రామంలో ఎలాంటి ఘర్షణలు చోటుచేసుకోకుండా పోలీస్ పికెట్ కొనసాగిస్తున్నట్లు తెలిపారు.

మూడో రోజు పోస్టల్ బ్యాలెట్‌కు అదే జోరు..

ఆదోని (అగ్రికల్చర్), మే 8: ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులు తమ పోస్టల్ బ్యాలెట్ మూడో రోజు బుధవారం అదే జోరుతో వినియోగించుకున్నారు. ఎన్నికల కమిషన్ మరో రోజు పొడిగించడంతో మరింత మంది ఉద్యోగులు తమ పోస్టల్ బ్యాలెట్ ఓటును వినియోగించుకునే సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. పట్టణంలోని నెహ్రూ మెమోరియల్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని ఎన్నికల అధికారి, ఆదోని సబ్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ పరిశీలించారు. నియోజకవర్గంలో ఓటు ఉన్న 330 మంది ఉద్యోగులు తమ పోస్టల్ బ్యాలెట్‌ని వినియోగించుకోగా, మరో 30 మంది ఇతర ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకున్నట్లు ఎన్నికల అధికారి తెలిపారు. పోలింగ్ కేంద్రం వద్ద డీఎస్పీ శివ నారాయణస్వామి ఆధ్వర్యంలో పట్టణ సీఐలు గోపి, తేజమూర్తి, నిరంజన్ రెడ్డితో ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు.

మాదిగల మద్దతు టీడీపీకే

ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు ఆర్‌జే ప్రకాష్

పత్తికొండ, మే 8 : రానున్న సార్వత్రిక ఎన్నికలలో రాష్ట్రంలో మాదిగల బేషరతుమద్దతు టీడీపీకేనని ఎమ్మార్పీఎస్ జాతీయఅధ్యక్షుడు ఆర్‌జె ప్రకాష్ అన్నారు. బుధవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. వైసీపీ ఐదేళ్లపాలనలో దళితులపై అనేకదాడులు జరిగాయని, 27 దళితసంక్షేమపథకాలు రద్దుచేసిన చరిత్ర జగన్మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. మాదిగల పంతం వైసీపీ అంతం అన్న నినాదంతో ఎమ్మార్పీఎస్ ముందుకసాగుతుందన్నారు. రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి తీసుకువచ్చేందుకు ఎమ్మార్పీఎస్ కృషిచేస్తుందన్నారు. వచ్చే ఎన్నికలలో పత్తికొండలో కేఈ శ్యాంబాబు గెలుపుకు, ఎంపీగా బస్తిపాటినాగరాజు గెలుపుకు నియోజకవర్గంలోని మాదిగలు ఓటువేసి వారిగెలుపుకు పనిచేయాలని పిలుపునిచ్చారు. టీడీపీ ఎస్సీసెల్‌రాష్ట్ర ఉపాధ్యక్షుడు చందోలితిరుపాల్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచుఎర్రగుడి కిష్టన్న, గంధం శ్రీనివాసులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే అభివృద్ధి

ఆలూరు : చంద్రబాబుతోనే షెడ్యూల్ కులాల అభివృద్ధి సాధ్యమని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షులు ఆర్‌జే ప్రకాష్ మాదిగ అన్నారు. బుధవారం ఆలూరు టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో, రాష్ట్ర పర్యటనలో భాగంగా కర్నూలు జిల్లాలో ఎమ్మిగనూరు, ఆలూరు, పత్తికొండ నియోజకవర్గాల్లో టీడీపీ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం నిర్వహించినట్లు తెలిపారు. చంద్రబాబు హయంలో ఎస్సీ వర్గీకరణకు అసెంబ్లీలో తీర్మాణం చేశారని గుర్తుచేశారు.

తొలిసారిగా పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకున్న జర్నలిస్టులు

పత్తికొండ టౌన్, మే 8: పట్టణంలో బుధవారం అక్రెడిటేషన్ కలిగిన జర్నలిస్టులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఏపీయూడబ్ల్యూజే ప్రతినిధుల బృందం స్థానిక ఎన్నికల రిటర్నింగ్ అధికారి రామలక్ష్మిని జర్నలిస్టులు ఉద్యోగులతో పాటు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకునేలా అవకాశం కల్పించాలని కోరగ. అందుకు స్పందించిన ఆర్వో రామలక్ష్మి జర్నలిస్టులకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వినియోగించుకునేలా అవకాశం కల్పించారు. దీంతో జర్నలిస్టులు స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ సెంటర్లకు చేరుకుని తమ ఓటు హక్కును పోస్టల్ బ్యాలెట్ ద్వారా వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా తొలిసారిగా ఓటు హక్కును వినియోగించుకున్న జర్నలిస్టులు సంతోషం వ్యక్తం చేశారు. యూనియన్ అధ్యక్షుడు సాలురంగడు, గౌరవ అధ్యక్షులు రంగన్న తదితరులు ఉన్నారు.

పోలింగ్ కేంద్రాల తనిఖీ

వెల్దుర్తి, మే, 8 : ఓటు హక్కు వినియోగించుకోవడానికి వచ్చే ఓటరుకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలింగ్ కేంద్రాలలో అన్ని సౌకర్యాలు కల్పించాలని ట్రైనీ కలెక్టర్ చల్లా కళ్యాణి అధికారులను ఆదేశించారు. బుధవారం వెల్దుర్తిలో జిల్లా పరిషత్ హైస్కూల్, గ్రామ పంచాయతీ పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు.

టీడీపీతోనే అందరికీ న్యాయం

- టీడీపీ ఆలూరు ఎమ్మెల్యే అభ్యర్థి వీరభద్రగౌడ్
- అస్పరి మండలంలో విస్తృత ప్రచారం
- గజ్జెహళ్లి సర్పంచు, ఉప సర్పంచుతో సహా 300 మంది టీడీపీలో చేరిక



అస్పరిలో ప్రసంగిస్తున్న వీరభద్ర గౌడ్, చిన్నారులతో ప్రచార రథంపై సాగుతూ.. బైలు పత్తికొండలో కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తూ.. మొలగవెళ్లిలో ప్రజలకు అభివాదం చేస్తున్న వీరభద్రగౌడ్

అస్పరి, మే 8: టీడీపీతోనే అందరికీ న్యాయం జరుగుతుందని ఆ పార్టీ ఆలూరు ఎమ్మెల్యే అభ్యర్థి వీరభద్రగౌడ్ అన్నారు. బుధవారం మండలంలోని అస్పరి, బైలు పత్తికొండ, గార్లపెంట గ్రామాల్లో పార్టీ శ్రేణులతో కలసి ఆయన విస్తృతంగా ఎన్నిక ప్రచారం నిర్వహించారు. గ్రామ గ్రామాన వీరభద్ర గౌడ్‌కు ప్రజలు ఘన స్వాగతం పలికారు. పలు గ్రామాల నుంచి స్వచ్ఛందంగా తరలివచ్చి మద్దతు ప్రకటించారు. భారీగా తరలివచ్చిన మహిళలతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. వైసీపీ పాలనలో మహిళలకు జరిగిన అన్యాయాన్ని వివరించారు. డ్వాక్రా సంఘాలు ఏర్పాటు చేసి మహిళా ఆర్థికాభివృద్ధికి బాటలు వేసింది చంద్రబాబేనని గుర్తుచేశారు. సైకిల్ గుర్తుపై ఓటు వేసి అఖండ మెజార్టీ అందించాలని కోరారు.

గజ్జెహల్లీ సర్పంచుతో సహ 300 మంది టీడీపీలో చేరిక

హొళగుంద/అస్పరి/దేవనకొండ: మండలంలోని గజ్జెహళ్లి గ్రామానికి చెందిన సర్పంచు అరుబోట్ల నాగమ్మ, ఆమె తనయుడు గిరిమల్ల, స్కూల్ చైర్మన్ లింగప్పతో సహా 300 మంది వైసీపీను వీడి వీరభద్ర గౌడ్ తమ్ముడు రాజగౌడ్, మల్లికార్జున గౌడ్, శివప్రకాష్ గౌడ్ ఆధ్వర్యంలో టీడీపీలోకి చేరారు. అలాగే అస్పరి మండడలం బైలు పత్తికొండ గ్రామనికి చెందిన 20 వైసీపీ కుటుంబాలు టీడీపీలోకి చేరాయి. వీరభద్రగౌడ్ వీరిని పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. దేవనకొండకి చెందిన 25 కుటుంబాలు టీడీపీ అభ్యర్థీ వీరభద్రగౌడ్ ,టీడీపీ అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. అలాగే తెర్నేకల్ గ్రామంలో దాదాపు 40 కుటుంబాలు వైసీపీని వీడి బోజ్జమ్మ సమక్షంలో టీడీపీ కండువాలు కప్పుకున్నారు

వైసీపీకి ఓటేస్తే రైతుల భూముల స్వాహా

చిప్పగిరి: వైసీపీకి ఓటేస్తే రైతుల భూములన్ని స్వాహా చేస్తారని మండల ఇన్‌చార్జి మల్లికార్జున గౌడ్, టీడీపీ నాయకులు మాజీ జెడ్పీటీసీ సభ్యుడు మీనాక్షి నాయుడు, రజిని, బోగేష్, పోతురాజు రాముడు, కొండ గోవిందు అన్నారు. బుధవారం చిప్పగిరి, నగరడోణ గ్రామంలో టీడీపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల భూములను కుదువ బెట్టి అప్పులు తెచ్చేందుకే భూ-సర్వే చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ సర్వే వల్ల చాలా గ్రామాల్లో రైతులకు అడంగల్, 1-బీ రాక బ్యాంకులో అప్పులు ఇవ్వడం లేదన్నారు. రైతులు 1-బీలు, అడంగల్ కోసం మీ సేవలు, గ్రామ సచివాలయాలు చుట్టూ చక్కర్లు కొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులను ఇబ్బంది పెట్టే వైసీపీని తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. మండల మాజీ ఉపాధ్యక్షుడు వెంకటేష్, సర్పంచు భీమలింగప్ప, మండల కన్వీనర్ షేక్షావలి, ప్రధాన కార్యదర్శి సతీష్, జనార్ధన్ గౌడ్ పాల్గొన్నారు.

వైసీపీని తరిమేద్దాం

- టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిబీవీ జయనాగేశ్వరరెడ్డి
- గోనెగండ్ల మండలోని ఎనిమిది గ్రామాల్లో విస్తృతంగా ఎన్నికల ప్రచారం
- స్వచ్ఛంతంగా తరలివచ్చి మద్దతు ప్రకటిస్తున్న గ్రామస్థులు



ఐరన్‌బండలో గజమాలతో బీవీని సన్మానిస్తున్న దృశ్యం, గాజులదిన్నెలో మాట్లాడుతున్న బీవీ జయనాగేశ్వరరెడ్డి, హాజరైన జనం,

గోనెగండ్ల, మే 8: అరాచక పాలన సాగిస్తున్న వైసీపీని రాష్ట్రం నుంచి తరిమి కొట్టే సమయం ఆసన్న మైందని, అందుకు జనం సిద్ధంగా ఉన్నారని టీడీపీ అభ్యర్థి బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. బుధవారం గోనెగండ్ల మండలంలోని గాజులదిన్నె, ఐరన్‌బండ, ఎన్నెకండ్ల, కులుమాల, అలువాల, హెచ్ కైరవాడి , పెద్ద నేలటూరు, చిన్న నేలటూరు గ్రామాల్లో ఆయన విస్తృతంగా పర్యటించారు. ఆయా గ్రామాల్లో ప్రజలు, కార్యకర్తలు మేళతాళాలతో బాణ సంచకాలుస్తు ఘనంగా స్వాగతం పలికారు. ఐరన్‌బండలో గజమాలతో బీవీని ఘనంగా సన్మానించారు. గ్రామస్థులు స్వచ్ఛంగా తరలివచ్చి బీవీకి మద్దతు ప్రకటిస్తున్నారు. కార్యక్రమంలో హనుమంతు, రామకృష్ణ, చేపల సంఘం నాయకుడు రంగస్వామి, శ్రీనివాసులు, నజీర్‌సాహెబ్, డాన్‌బాషా, నాగన్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం గాజులదిన్నె గ్రామంలో వైసీపీకి చెందిన గ్రామ ఉపసర్పంచు రాజు, ఆయన తోపాటు మరో 50 మంది బీవీ జయనాగేశ్వరరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు.

టీడీపీ శ్రేణులు ముమ్మర ప్రచారం

పట్టణంలోని 21 వార్డులో కౌన్సిర్ దయాసాగర్ దంపతులు ఇంటింటికి తిరుగుతూ ప్రచారం చేస్తున్నారు. అలాగే 15వ వార్డులో మాజీ కౌన్సిలర్ ముల్లా కలీముల్లా, 33వ వార్డులో రామకృష్ణ ఆధ్వర్యంలో మహిళా నాయకులు ఇంటింటికి తిరుగుతూ ఓట్లు అభ్యర్థిస్తున్నారు. మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ కొండయ్య చౌదరి, కౌన్సిలర్ రామదాసు గౌడ్, మాజీ కౌన్సిలర్ రంగస్వామి గౌడ్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు సుందరాజు, మాజీ కౌన్సిలర్ గుల్లా సలాం, బోయ జయన్న ప్రచారం నిర్వహించారు.

మాస్టర్ వీవర్స్‌తో బీవీ ఆత్మీయ సమావేశం



మాజీ ఎమ్మెల్యే బీవీకి, ఎంపీ సంజీవ్‌కుమార్‌కు స్వాగతం పలుకుతున్న మాస్టర్ వీవర్స్

ఎమ్మిగనూరు : పట్టణంలోని పద్మశాలి కల్యాణమండలంలో మాస్టర్ వీవర్స్‌తో మాజీ ఎమ్మెల్యే, టీడీపీ అభ్యర్థి బీవీ జయనాగేశ్వరరెడ్డి ఆత్మీయ సామావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేనేతలు సొంతంగా ఎదిగేందుకు చంద్రబాబుతో మాట్లాడి నేనేతకార్పోరేషన్ ఏర్పాటు చేసి సబ్సిడీ రుణాలు ఇచ్చేవిధంగా కృషిచేస్తానన్నారు. అంతకు ముందు ఎంపీ సంజీవ్ కుమార్ మాట్లాడుతూ బీసీలకు టీడీపీలోనే గుర్తింపు ఉందని, టీడీపీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. టీడీపీ నాయకులు చేనేతమల్లి, మాస్టర్ వీవర్స్ నజీర్, రంగస్వామి, నాయకులు పట్టానాగరాజు, కే నాగరాజు, ఈరన్న, ఎన్డీఏ కూటమి నాయకులు పాల్గొన్నారు.

మంత్రాలయంలో మార్పు ఖాయం

- దోపిడీదారు ఎమ్మెల్యే బాలనాగిరెడ్డికి ఓటుతోనే సమాధానం
- టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రాఘవేంద్రరెడ్డి
- కౌతాళం మండలంలో విస్తృతంగా ఎన్నికల ప్రచారం
- ఓంనగర్, కల్లుకుంట, చెట్నహల్లి వైసీపీ కుటుంబాలు టీడీపీలో చేరిక



కౌతాళం ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న రాఘవేంద్ర రెడ్డి, ప్రచారంలో పాల్గొన్న ప్రజలు, మహిళలతో కలసి విజయకేతనం చూపుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి, వైసీపీ నాయకులను టీడీపీలోకి ఆహ్వానిస్తున్న రాఘవేంద్రరెడ్డి

కౌతాళం, మే 8: మంత్రాలయంలో మార్పు ఖాయమైందని, త్వరలో భూ కబ్జాకోరులను ఇంటికి పంపేందుకు నియోజకవర్గ ప్రజలు ఓటుతో సిద్ధంగా ఉన్నారని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రాఘవేంద్రరెడ్డి అన్నారు. బుధవారం చిరుతాపల్లి, మల్లనహట్టి, కరణి, తిప్పలదొడ్డితో పాటు మండల కేంద్రంలో కూటమి నాయకులతో కలిసి టీడీపీ ఎన్నికల ప్రచారం నిర్వహించింది. గ్రామాల్లో టీడీపీ నాయకులు ఘనస్వాగతం పలికారు. కౌతాళంలో భారీ సంఖ్యలో తరలివచ్చి రాఘవేంద్రరెడ్డిని గెలిపించుకుందామని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభ్యర్థి రాఘవేంద్ర రెడ్డి మాట్లాడుతూ ఒక్క అవకాశం అంటూ అధికారంలోకి వచ్చిన జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా మార్చారని విమర్శించారు. మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన బాలనాగిరెడ్డి ప్రజలకు కనీసం తాగునీరు కూడా అందించలేదని విమర్శించారు. ప్రజలందరి సహకారంతో నియోజకవర్గ అభివృద్దే ధ్యేయంగా పనిచేస్తానని, సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చెన్నబసప్ప, అడివప్పగౌడ్, వెంకటపతిరాజు, కోట్రేష్‌గౌడ్ సురేష్‌నాయుడు, కోట్రేష్‌గౌడ్, టిప్పుసుల్తాన్, సతీష్‌నాయుడు, చిన్న తిక్కయ్య, రంగస్వామి జనసేనా నాయకుడు రామాంజనేయులు, బీజేపీ నాయకులు ఆయా గ్రామాల నాయకులు ఉన్నారు.

వైసీపీ నుంచి వందకుటుంబాలు టీడీపీలో చేరిక



రాఘవేంద్రరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరిన యూత్

మంత్రాలయం : పెద్దకడుబూరు మండలంలోని వివిధగ్రామాలకు చెందిన వైసీపీ కుటుంబాలు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రాఘవేంద్రరెడ్డి, నియోజకవర్గ పరిశీలకులు దేవళ్ల మురళి, ఎమ్మెల్యే అభ్యర్థి సోదరులు రఘునాథరెడ్డి, రామక్రిష్ణారెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. ఓంనగర్ నుంచి 30, కల్లుకుంట నుంచి 40, చెట్నహల్లి నుంచి భీమా యూత్ గ్రూపు నుంచి 30 కుటుంబాలు టీడీపీలో చేరాయి. కార్యక్రమంలో చెట్నహల్లికి చెందిన భీమా యూత్ నాయకులు మల్లికార్జున, బోయ నరసింహులు, శేఖర్, శివక్రిష్ణ, రామక్రిష్ణ, కురువ మల్లేష్, కల్లుకుంటకు చెందిన రామాంజిని, శివరామ్, వడ్డె రాజు, వడ్డె అయ్యప్ప, ఓంనగర్‌కు చెందిన పురుషోత్తం, సందీప్, పెద్ద రంగన్న, ఉచ్చీరప్పలు పాల్గొన్నారు.

కష్టాలు తీరాలంటే టీడీపీ రావాలి

- చంద్రన్నతోనే స్వర్ణాంధ్ర సాధ్యం...
- ఒక్క చాన్స్‌తో గద్దెనెక్కి.. అభివృద్ధిలో 20 ఏళ్లు వెనక్కు నెట్టారు
- టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కేఈ శ్యాంబాబు



ప్రజలకు అభివాదం చేస్తున్న కేఈ, గుడిసెవాసుల సమస్యలు వింటున్న కేఈ



పి.కొత్తూరులో గజమాలతో కేఈ సన్మానిస్తున్న నాయకులు, మాట్లాడుతున్న కేఈ



2 పెరవలిలో ఖాళీ బిందెలతో గ్రామస్థలతో కలిసి కేఈ హరిబాబు, ప్రచారంలో పాల్గొన్న ప్రజలు

తుగ్గలి, మే 8: రాష్ట్ర ప్రజల కష్టాలు తీరాలంటే టీడీపీ అధికారంలోకి రావాలని, చంద్రబాబుతోనే స్వర్ణాంధ్ర సాధ్యమని టీడీపీ పత్తికొండ ఎమ్మెల్యే అభ్యర్థి కేఈ శ్యాంబాబు అన్నారు. ఒక్క చాన్స్ అంటూ గద్దెనెక్కి జగనాసురుడు రాష్ట్రాన్ని 20 ఏళ్లు అభివృద్ధి వెనక్కు నెట్టారని జగన్‌పాలనపై నిప్పులు చెరిగారు. బుధవారం మండలంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రచార రథంపై దాదాపు మండలంలో 17 గ్రామాల్లో కేఈ శ్యాంబాబు విస్తృతంగా ఎన్నికల ప్రచారం చేశారు. ఆయా గ్రామాల్లో ప్రజలు, పార్టీశ్రేణులు గజమాలలతో స్వాగతం పలికగా.. మహిళలు హారతులు ఇచ్చి వీర తిలకం దిద్దారు. సైకిల్ గుర్తుపై ఓటు వేసి అఖండ మెజార్టీతో ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించాలని కోరారు. టీడీపీ శ్యాంబాబు కాన్వాయ్ వెళ్తుండగా.. కేపీ గుడిసెల్లో మహిళలు అక్కడకు చేరుకుని వారి సమస్యలను విన్నవించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తుగ్గలి నాగేంద్ర, బత్తిన వెంకట్రాముడు, మనోహర్ చౌదరి, తిమ్మయ్య చౌదరి, వెంకటపతి, తిరుపాల్ నాయుడు, మిద్దె వెంకటేశ్ యాదవ్, మోహన్, సోమశేఖర్ గౌడు, ఈశ్వర్ రెడ్డి, శివరాముడు చౌదరి, లక్ష్మీనారాయణ చౌదరి పాల్గొన్నారు.

మదనంతపురంలో ఇంటింటి ప్రచారం

మద్దికెర : మదనంతపురం గ్రామంలో టీడీపీ ఎంపీ అభ్యర్థి పంచలింగాల బస్తిపాటి నాగరాజును, ఎమ్మెల్యే అభ్యర్థి కేఈ శ్యాంబాబును గెలిపించాలని కోరుతూ నాయకులు ప్రసాద్, హనుమంతు ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేస్తూ ఓట్లను అభ్యర్థించారు. అలాగే పెరవలి గ్రామంలో కేఈ హరిబాబు ఇంటింటి ప్రచారం నిర్వహించి సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వెంకటవర్మ, పులిశేఖర్, రంగస్వామి, రాముా యాదవ్, నరసింహులు గౌడు తదితరులు ఉన్నారు.

తమ్ముళ్లపై దౌర్జన్యాలకు వస్తే ఖబర్దార్



మాట్లాడుతున్న కేఈ ప్రభాకర్

మనమంతా ఒకే కుటుంబమని, అన్నదమ్ముల్లా కలిసి ఉందామని, మన సమస్యలు మనమే పరిష్కరించుకుందామని, మా తమ్ముళ్ల జోలికి ఎవరైనా వస్తే ఖబర్దార్ అని మాజీ మంత్రి కేఈ ప్రభాకర్ అన్నారు. బుధవారం శభాష్‌పురం, కేపీ గుడిసెల, గుడిసె గుప్పిరాళ్ల, డీసీ కొండ గ్రామాల్లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న కేఈ ప్రభాకర్ మాట్లాడుతూ స్థానిక వైసీపీ నాయకులు అధికార పార్టీని చూసుకుని రెచ్చిపోవడం తగదని, రాబోవు రోజుల్లో పరిస్థితులు మారుతాయని హెచ్చరించారు.

ఆదోని ప్రజలు అణచివేతకు గురయ్యారు

కూటమి నాయకులతో కలిసి డాక్టర్ పార్థసారధి ప్రచారం



విజయభాస్కర్ రెడ్డి కాలనీ ప్రచారంలో పార్థసారధి

ఆదోని, మే 8: ఆదోనిలో అన్ని ముఖ్య స్థలాలుకబ్జాలకు గురయ్యాయని, ఒకవేళ నిలదీస్తే దాడులు, దౌర్జన్యాలు, అణచివేతలకు పాల్పడ్డారని కూటమి అభ్యర్థి డాక్టర్ పార్థసారధి అన్నారు. బుధవారం పట్టణంలోని ఎల్‌బజీ, విజయ భాస్కర్ రెడ్డి కాలని, వాసవి కళ్యాణ మండపంలో రజక సంఘం నాయకులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా పార్థసారధి మాట్లాడారు. ఆదోనిలో స్థానిక ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి ఆటవిక పరిపాలన కొనసాగిస్తున్నారని ఆరోపించారు. తాను నిజాయితీతో ప్రజల్లోకి వెళ్తున్నానని, మంచికి స్పందన వస్తుందని, తప్పు చేసిన వ్యక్తి కాబట్టే సాయిప్రసాద్ రెడ్డి ఓటమి భయంతో భయపడి గ్రామాల్లో తిరుగుతున్నారని ఆరోపించారు. మత రాజకీయాల చేయడానికి మాత్రం ఎన్డీఏ కూటమి వ్యతిరేఖమని అన్నారు. ఎమ్మెల్యే తమ రాజకీయాలు చేస్తూ పబ్బం గడుపుతున్నాడని ఆరోపించారు. జగనన్న కాలనీ కోసం 117 ఎకరాలు తీసుకున్నారని, రైతుల దగ్గర పొలాలను తక్కువ ధరకు కొనుగోలు చేసి, రూ.100 కోట్లకు పైగా జగనన్న కాలనీలో స్వాహా చేశారని పేర్కొన్నారు. బీజేపీకి ఓటువేసి గెలిపించాలని కోరారు.



రజకల సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ పార్థసారధి